జాతీయ తెలుగు దినపత్రిక

RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు

తెలుగు పత్రికా రంగంలో నూతనంగా అడుగుపెట్టి విశేష ప్రజాదరణతో ముందుకు సాగుతున్న మన 'సందేశం టైమ్స్' తెలుగు దిన పత్రికలో పని చేయుటకు రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి స్టాఫ్ రిపోర్టర్స్ కావలెను. అలానే మండల స్థాయి రిపోర్టర్స్ కావలెను.కొత్త వారికి అవకాశం కలదు

ఎడిటర్ : 90520 45435

PUBLISHED: TG & AP సంపుటి : 1 సంచిక: 154 గురువారం 30 అక్టోబరు– 2025 పేజీలు : 8 వెల 2 /-

Published from :Adilabad, Bhadradri Kothagudem, Hanumakonda, Hyderabad, Jagtial, Jangaon, Jayashankar Bhupalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahbubnagar, Mancherial, Medak, Medchal-Malkajgiri, Mulugu, Nagarkurnool, Nalgonda, Narayanpet, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Ranga Reddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal, and Yadadri Bhuvanagiri.

## తుపాను బాధితులకు

# ఆర్థికసాయం ప్రకటించిన ఏపీ ప్రభుత్వం

## మొంథా తుపాను బాధితులకు ఏపీ ప్రభుత్వం ఆర్థిక సాయం




- పునరావాస కేంద్రాల్లో ఉన్నవారికి తొలి దశలో సాయం
- ప్రతి వ్యక్తికి రూ.1000, కుటుంబానికి గరిష్ఠంగా రూ.3000
- ఇళ్లకు వెళ్లే ముందు బాధితులకు నేరుగా నగదు అందజేత
- విపత్తు నిర్వహణ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఉత్తర్వులు జారీ
- గత వారం కోస్తాంధ్రను అతలాకుతలం చేసిన మొంథా తుపాను

అక్టోబర్ 29 (సందేశం టైమ్స్) : :మొంథా తుపాను కారణంగా నిరాశ్రయులైన బాధితులను ఆదుకునేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. తుపాను ప్రభావంతో పునరావాస కేంద్రాల్లో తలదాచుకుంటున్న వారికి తక్షణ ఆర్థిక సాయం అందించాలని కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు కేంద్రాల్లో ఉన్న ప్రతి వ్యక్తికి రూ. 1,000 చొప్పున, ఒక కుటుంబానికి గరిష్ఠంగా రూ. 3,000 వరకు నగదు అందించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విషయంపై విపత్తు నిర్వహణ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సాయిప్రసాద్ బుధవారం ఆదేశాలు జారీ చేశారు. పునరావాస కేంద్రాల నుంచి బాధితులు తమ ఇళ్లకు తిరిగి వెళ్లే సమయంలో ఈ నగదును నేరుగా అందించాలని స్పష్టం చేశారు. మూడు లేదా అంతకంటే ఎక్కువ మంది సభ్యులు ఉన్న కుటుంబాలకు రూ. 3,000 సాయం అందుతుంది.



## భారత్ – చైనా చర్చలు..

# సరిహద్దు ప్రాంతాల్లో శాంతి

ఢిల్లీ:అక్టోబర్ 29 (సందేశం టైమ్స్) : భారత్ – చైనా సరిహద్దు ప్రాంతాల్లో శాంతిని నెలకొల్పడానికి ఇరు దేశాల మధ్య సైనిక చర్చలు జరిగినట్లు విదేశాంగ శాఖ వెల్లడించింది. చుషుల్–మోల్డో సరిహద్దుల్లో ఈనెల 25న భారత్ భూభాగంలో చర్చలు జరిగినట్లు తెలిపింది. సమావేశంలో తీసుకున్న నిర్ణయాల్లో భాగంగా.. ఏడు ఘర్షణ పాయింట్ల నుంచి ఇరువైపులా.. సైన్యాన్ని పూర్తిగా తొలగించినట్లు అధికారులు పేర్కొన్నారు. ఐదు పాయింట్ల నుంచి.. పెట్రోలింగ్ పునఃప్రారంభమైందన్నారు. తూర్పు లడఖ్‌లోని సరిహద్దుల్లో ఉద్రిక్తత పూర్తిగా తగ్గిందని విదేశాంగ శాఖ అధికారులు స్పష్టం చేశారు.భారత్– చైనా సరిహద్దు ప్రాంతాల్లో సంయుక్తంగా శాంతిని కాపాడేందుకు అంగీకరించారని విదేశాంగ శాఖ అధికారులు పేర్కొన్నారు.

## భద్రాచలం సమీపంలో వాయుగుండం.. పలు జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో అలర్ట్ జారీ



మిగతా 2లో...

అమరావతి, అక్టోబర్ 29(సందేశం టైమ్స్) : మొంథా తీవ్ర తుపాను గత రాత్రి కాకినాడకు దక్షిణంగా నరసాపూర్‌కు సమీపంలో తీరం దాటిందని వాతావరణ శాఖ తెలిపింది. ఉత్తర వాయువ్యదిశగా పయనిస్తూ క్రమంగా బలహీనపడి తీవ్ర వాయుగుండంగా మారి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలను ఆనుకొని భద్రాచలం సమీపంలో కొనసాగుతుందని పేర్కొంది. దీని ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో పలు చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు పడతాయని స్పష్టం చేసింది. బుధవారం భారీ వర్షాలు పడుతాయని ఎన్టీఆర్, పల్నాడు, ప్రకాశం, నంద్యాల జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖ, అల్లూరి, అనకాపల్లి, ఏలూరు, పశ్చిమగోదావరి, గుంటూరు, బాపట్ల, కర్నూలు, కడప, నెల్లూరు జిల్లాలకు ఎల్లో అలర్ట్ ప్రకటించింది.

## అన్ని రేషన్ షాపులకు నిత్యావసర సరుకులు.. పవన్



అమరావతి,అక్టోబర్ 29 (సందేశం టైమ్స్) : తుపాను ప్రభావిత ప్రాంత ప్రజలకు నిత్యావసర సరుకులను ఉచితంగా పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. తుపాను బాధిత కుటుంబానికి 25 కేజీల చొప్పున బియ్యాన్ని ఉచితంగా ఇవ్వాలని ఆదేశించింది. నిత్యావసర సరుకుల పంపిణీపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందించారు. మొంథా తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పునరావాస కేంద్రాల్లో ఉన్నవారికి, ఉపాధి కోల్పోయిన మత్స్యకారులు, చేనేత కార్మికులకు నిత్యావసరాలను ఉచితంగా అందించేందుకు కూటమి ప్రభుత్వం సన్నద్ధమైందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్దేశించిన విధంగా అధికార యంత్రాంగం నిత్యావసరాలను సమకూర్చిందని చెప్పారు.

మిగతా 2లో...

## జగన్ లండన్ పర్యటనపై

# సీబీఐ పిటిషన్..



హైదరాబాద్/అమరావతి,అక్టోబర్ 29(సందేశం టైమ్స్): అక్రమా స్తుల కేసులో ప్రధాన నిందితుడు (ఏ1), ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి లండన్ పర్యటనపై సీబీఐ వేసిన పిటిషన్‌పై న్యాయస్థానం ఈరోజు (బుధవారం) తీర్పు ఇచ్చింది. సీబీఐ వేసిన పిటిషన్‌ను కోర్టు డిస్మిస్ చేసింది. తన పెద్ద కుమార్తెను చూసేందుకు జగన్ ఈనెల 11న లండన్ వెళ్లిన విషయం తెలిసిందే.

మిగతా 2లో...

# ఏపీలో మొంథా తుపాను బీభత్సం...



- ఏపీ తీరాన్ని దాటిన తీవ్ర తుపాను మొంథా, పలు జిల్లాల్లో విధ్వంసం
- గాలుల బీభత్సానికి ఇద్దరు మృతి, భారీగా ఆస్తి, పంట నష్టం
- కోనసీమలో 20 వేల ఎకరాల్లో వరి పంట ధ్వంసమైనట్లు మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడి
- తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సీఎం చంద్రబాబు ఏరియల్ సర్వే, సమీక్ష
- పునరావాస కేంద్రాల్లోని బాధితులకు ఆర్థిక సాయం, నిత్యావసరాల పంపిణీ
- సహాయక చర్యల్లో పాల్గొంటున్న ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు

అక్టోబర్ 29(సందేశం టైమ్స్): మొంథా తీవ్ర తుపాను ఆంధ్రప్రదేశ్‌ను అతలాకుతలం చేసింది. బుధవారం తెల్లవారుజామున రాష్ట్ర తీరాన్ని దాటిన ఈ తుఫాను పెను విధ్వంసం సృష్టించింది. ఈ ఘటనలో ఇద్దరు మృతి చెందగా, వేలాది ఇళ్లు, పంటలు, విద్యుత్ టవర్లు దెబ్బతిన్నాయి. తుపాను ధాటికి జనజీవనం పూర్తిగా స్తంభించిపోయింది.

మిగతా 2లో...

## మరో 48 గంటల పాటు అప్రమత్తంగా ఉండాలి:

### మొంథా తుపాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో మంత్రి లోకేశ్ సమీక్ష



- తుపాను సహాయక చర్యలపై దృష్టిసారించిన మంత్రి
- అప్రమత్తంగా ఉండాలని అధికారులకు ఆదేశం
- విద్యుత్ పునరుద్ధరణ, పంట నష్టం అంచనాపై ప్రత్యేక దృష్టి
- ముంపు ప్రాంతాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని సూచన
- దెబ్బతిన్న రహదారుల మరమ్మతులు వెంటనే చేపట్టాలన్న ఆదేశాలు
- బాధితులకు నిత్యావసరాలు పంపిణీ చేయాలని దిశానిర్దేశం

2 లో

అక్టోబర్ 29 (సందేశం టైమ్స్) :మొంథా తుపాను తీరం దాటిన నేపథ్యంలో, ప్రభావిత జిల్లాల్లో సహాయక చర్యలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. తుపాను అనంతర పరిస్థితులపై విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో హెూంమంత్రి అనిత, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్,

## మూసీ నదికి వరద పోటు

## 7 గేట్లు ఎత్తివేత



మిగతా 2లో...

నల్లగొండ : అక్టోబర్ 29(సందేశం టైమ్స్) : నల్లగొండ జిల్లా కేతేపల్లి మండల పరిధిలోని మూసీ నదికి వరద పోటెత్తింది. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో పాటు ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ నుంచి మూసీకి భారీగా వరద నీరు వచ్చి చేరుకుంటుంది.

మొదటి పేజీ తరువాయి

# తుపాను బాధితులకు ఆర్థికసాయం ప్రకటించిన ఏపీ ప్రభుత్వం

రోజువారీ అవసరాలకు, అత్యవసర ఖర్చులకు ఉపయోగపడుతుందని అధికారులు తెలిపారు.కోస్తాంధ్రను మొంథా తుపాను అతలాకుతలం చేసిన విషయం తెలిసిందే. భారీ వర్షాలు, బలమైన గాలుల కారణంగా వేలాది మంది నిరాశ్రయులయ్యారు. ప్రభావిత ప్రాంతాల్లో ప్రభుత్వం ఇప్పటికే ఆహారం, తాగునీరు, వైద్య సదుపాయాలు కల్పిస్తోంది. తాజాగా ప్రకటించిన ఆర్థిక సాయం బాధితులకు కొంత ఊరట కలిగించే అంశం. అయితే ఇది కేవలం తక్షణ సాయం మాత్రమేనని, ఆస్తి నష్టానికి సంబంధించి పూర్తిస్థాయి పరిహారం అందించాలని స్థానిక ప్రజాప్రతినిధులు కోరుతున్నారు.

బాధితులు తమ స్థానిక అధికారుల ద్వారా ఈ సాయం పొందవచ్చని అధికారులు సూచించారు. తుపాను ప్రభావిత ప్రజలు తిరిగి సాధారణ జీవితం గడిపేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. బాధితుల పూర్తి వివరాలు, పంపిణీకి సంబంధించిన ఏర్పాట్లను అధికారులు వేగవంతం చేస్తున్నారు.

# అన్ని రేషన్ షాపులకు నిత్యావసర సరుకులు.. పవన్

బియ్యం 25 కేజీలు (మత్స్యకారులకు, చేనేత కార్మికులకు 50 కేజీలు), కందిపప్పు కేజీ, పామాయిల్ ఒక లీటర్, ఉల్లిపాయలు కేజీ, బంగాళాదుంపలు కేజీ, పంచదార కేజీ చొప్పున అందిస్తారన్నారు. పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాలను అనుసరించి ఆ శాఖ అధికార యంత్రాంగం అన్ని రేషన్ షాపులకు వీటిని చేర్చిందని డిప్యూటీ సీఎం వెల్లడించారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లోని 14,415 రేషన్ షాపుల్లో 1 లక్ష మెట్రిక్ టన్నుల బియ్యం, 3424 మెట్రిక్ టన్నుల పంచదారతో పాటు ఇతర నిత్యావసరాలను పంపిణీకి సిద్ధంగా ఉంచారన్నారు.

# మరో 48 గంటల పాటు అప్రమత్తంగా ఉండాలి:

ఆర్టీజీఎస్ సెక్రటరీ కాటంనేని భాస్కర్ పాల్గొన్నారు. తుపాను నష్టం, సహాయక చర్యలపై లోకేశ్ అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, "రాబోయే 48 గంటల పాటు అధికారులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలి. తుపాను ప్రభావిత ప్రాంతాల్లోని గృహాలు, వాణిజ్య సముదాయాలకు వందశాతం విద్యుత్ సరఫరాను తక్షణమే పునరుద్ధరించాలి. భారీ వర్షాల కారణంగా రహదారులపై పేరుకుపోయిన మట్టి, బురదను తొలగించేందుకు అగ్నిమాపక శాఖ చర్యలు తీసుకోవాలి" అని ఆదేశించారు.పంట నష్టం అంచనాలను వెంటనే రూపొందించాలని, దెబ్బతిన్న పంటలను కాపాడేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని లోకేశ్ సూచించారు. మొంథా తీవ్ర తుపాను కారణంగా సంభవించిన ప్రాణ నష్టం, దెబ్బతిన్న నిర్మాణాలపై పూర్తి నివేదిక అందించాలని కోరారు. వర్షాల ధాటికి దెబ్బతిన్న వంతెనలు, కల్వర్టులను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. చెరువులు, కుంటలు, కాలువ గట్లను పటిష్టపరిచేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని దిశానిర్దేశం చేశారు.ముంపు ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి స్పష్టం చేశారు. "అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. పాముకాటుకు ఉపయోగించే యాంటీ వీనం ఔషధాలను అన్ని ఆసుపత్రుల్లో అందుబాటులో ఉంచాలి. ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. తుపాను బాధితులు, మత్స్యకారులకు అవసరమైన నిత్యావసర సరకులను వెంటనే పంపిణీ చేయాలి" అని లోకేశ్ అధికారులను ఆదేశించారు.

# ఏపీలో మొంథా తుపాను బీభత్సం...

భారీ గాలులకు చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. కుండపోత వర్షాలకు వాగులు, వంకలు, చెరువులు పొంగిపొర్లుతున్నాయి. దీంతో కోస్తా జిల్లాల్లోని అనేక గ్రామాలు, పట్టణాల్లోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలుచోట్ల రోడ్లపైకి వరద నీరు చేరడంతో వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు రంగంలోకి దిగి, నేలకొరిగిన చెట్లను, స్తంభాలను తొలగించే పనుల్లో నిమగ్నమయ్యాయి. ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు అధికారులు ప్రయత్నిస్తున్నారు.

కాకినాడ, మచిలీపట్నం మధ్య నర్సాపురం సమీపంలో మొంథా తుపాను తీరాన్ని దాటినట్లు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తెలిపింది. ఆ తర్వాత క్రమంగా బలహీనపడి తీవ్ర వాయుగుండంగా, ఆపై వాయుగుండంగా మారింది. ఇది వాయవ్య దిశగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, దక్షిణ ఛత్తీస్‌గఢ్ మీదుగా పయనించి రాబోయే ఆరు గంటల్లో అల్పపీడనంగా బలహీనపడనుందని అధికారులు వెల్లడించారు.

## జగన్ లండన్ పర్యటనపై సీబీఐ పిటిషన్..

అయితే బెయిల్ షరతులను ఉల్లంఘిస్తూ జగన్.. తన సొంత ఫోన్ నెంబర్‌ను వెల్లడించలేదంటూ సీబీఐ పిటిషన్ దాఖలు చేసింది. లండన్ పర్యటనలో ఉన్న సమయంలో మాజీ సీఎంకు మూడు సార్లు కాల్ చేశామని.. కానీ ఆయన ఇచ్చిన నెంబర్ పనిచేయలేదని సీబీఐ తెలిపింది.

ఉద్దేశపూర్వకంగానే పని చేయని నెంబర్ ఇచ్చారని సీబీఐ వాదనలు వినిపించింది. ఇకపై జగన్ విదేశీ పర్యటనలకు వెళ్లేందుకు అనుమతి ఇవ్వొద్దని కోర్టును అభ్యర్థించింది.

## భద్రాచలం సమీపంలో వాయుగుండం..పలు జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో అలర్ట్ జారీ

కోస్తా జిల్లాల్లో గంటకు 60 నుంచి 70 గరిష్టంగా 80 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని వెల్లడించింది. తీరం వెంబడి గంటకు 45 నుంచి 55 గరిష్టంగా 65 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని తెలిపింది. మత్స్యకారులు ఈరోజు, రేపు చేపల వేటకు వెళ్లారాదని వాతావరణ శాఖ హెచ్చరించింది. రాష్ట్రంలో అన్ని పోర్టులలో మూడవ నెంబర్ ప్రమాద హెచ్చరిక జారీ చేసింది. పల్నాడు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో ఆకస్మిక వరదలు వచ్చే అవకాశం ఉందని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. రేపు ఉత్తరాంధ్రలోని అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని వెల్లడించింది.

# విద్యారంగంలో వెలుగునిచ్చిన మార్గదర్శి..అమరపల్లి కొండలు









చిన్న గ్రామం నుండి పెద్ద మార్పు తీసుకురావాలనే కలతో జీవితం మొత్తాన్ని విద్యార్థుల భవిష్యత్తుకే అంకితం చేసిన వ్యక్తి ం అమరపల్లి కొండలు గారు. 2019 నుంచి 2025 వరకు ఆయన చేసిన సేవా యాత్ర అనేక కుటుంబాల జీవితాల్లో వెలుగు నింపింది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల ప్రతిభను గుర్తించి, వారిని ప్రోత్సహిస్తూ గురుకులాలు, రెసిడెన్షియల్ స్కూల్స్, మరియు ఉన్నత విద్యా సంస్థల్లో ప్రవేశం పొందేలా మార్గం చూపారు.కేవలం సలహా ఇవ్వడమే కాదు ం స్వయంగా వారికి మార్గదర్శకత్వం అందించి, అడుగు అడుగునా తోడుగా నిలిచారు. పాఠశాల స్థాయి నుండే టెన్త్, ఇంటర్మీడియట్, డిగ్రీ వరకు విద్యార్థులను తీసుకెళ్లి, అడ్మిషన్‌లు చేయించి, వారికి అవసరమైన సహాయం అందించడం ఆయన ప్రత్యేకత.

తన బోధనా నైపుణ్యం, అంకితభావం, సేవా తత్వం ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపారు. ఆయన మార్గదర్శకత్వంలో చదివిన విద్యార్థులు ఈ రోజున చాలామంది లిసబ్‌ఇన్‌స్పెక్టర్లు (%ూ×%లు)లిగా, వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగాలు పొందారు.

అమరపల్లి కొండలు గారు ప్రతి విద్యార్థిని భవిష్యత్తు నిర్మాతగా తీర్చిదిద్దడమే తన ధ్యేయంగా తీసుకున్నారు. ఆయన నమ్మకం ం

"నేటి విద్యార్థులు రేపటి భవిష్యత్తు."

అంతా తమ స్వార్థ ప్రయోజనాల కోసం పరుగులు తీస్తున్న కాలంలో, విద్యార్థుల విజయమే తన విజయమని భావించి సేవ చేసిన ఈ మార్గదర్శి విద్యారంగంలో ప్రేరణగా నిలిచారు.

# ఎం.ఎన్.ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో రోబోటిక్స్ శిక్షణా శిబిరం విజయవంతం




సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 29అక్టోబర్: సంగారెడ్డి జిల్లా ఎం.ఎన్.ఆర్ ఇంజినీరింగ్ కాలేజీలో సోహం అకాడమీ ఆధ్వర్యంలో రోబోటిక్స్ వర్క్‌షాప్ విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో మొత్తం 82 మంది విద్యార్థులు (33 మంది బాలికలు, 49 మంది బాలురు) ఉత్సాహంగా పాల్గొన్నారు. వర్క్‌షాప్‌కు %ూఎఅ-ఎష్ట్రతీశీఅఎ% సంస్థ స్పాన్సర్‌గా సహకరించింది.ఈ శిక్షణను సోహం అకాడమీ ట్రైనర్లు విద్యార్థులకు అందించారు. విరోబోటిక్స్ ప్రాథమికాలు, హార్డ్వేర్ పరిజ్ఞానం, ప్రాజెక్ట్ డిజైన్ మరియు ప్రాక్టికల్ శిక్షణను నేర్చుకోవడంలో కళాశాల విద్యార్థులు ఎంతో ఆసక్తి చూపారు. ముఖ్యంగా, కాలేజీ మేనేజ్‌మెంట్ మరియు ఫ్యాకల్టీ కూడా విద్యార్థులతో కలిసి చురుకుగా పాల్గొని ప్రాజెక్ట్‌లను ప్రాక్టికల్‌గా అమలు చేయడంలో సహకరించారు. సోహం అకాడమీ ఇప్పటికే సంగారెడ్డి జిల్లాలో 17 పాఠశాలల్లో రోబోటిక్స్ వర్క్‌షాప్‌లు నిర్వహించింది. ఇప్పుడు ఈ కాలేజీ విద్యార్థులు ఆ పాఠశాలలకు వెళ్లి విద్యార్థులు ఇన్నోవేషన్ మోడల్స్ రూపొందించే సమయంలో వారికి మార్గనిర్దేశం చేయనున్నారు.గత కొన్ని సంవత్సరాల్లో సోహం అకాడమీ తెలంగాణలోని 27 జిల్లాల్లో 493 పాఠశాలలు, 92,936ం పాఠశాల విద్యార్థులు, అలాగే 56 కాలేజీల్లో 5,560ం కళాశాల విద్యార్థులకు రోబోటిక్స్ శిక్షణను అందించింది. తెలంగాణ రాష్ట్రాన్ని రోబోటిక్స్ విద్యలో ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో సోహం అకాడమీ కీలక పాత్ర పోషిస్తోంది.

# 68 ఏళ్లలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నాం

**ఘనంగా 68వ వార్షికోత్సవ సభ..**

**గౌడ కులస్తుల సంక్షేమం కోసం నిరంతరం పోరాటం**

**సంగారెడ్డి జిల్లా గౌడ సంఘం అధ్యక్షులు నక్క నాగరాజు గౌడ్**





సందేశం టైమ్స్:సంగారెడ్డి ప్రతినిధి 29అక్టోబర్: కల్లుగీత కార్మిక సంఘం సంగారెడ్డి జిల్లా కమిటీ 68వ వార్షికోత్సవ సభ కల్లుగీత కార్మిక సంఘం సంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం సంగారెడ్డిలోని సుందరయ్య భవన్ లో వార్షికోత్సవ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ వార్షికోత్సవ సందర్భ పర్వదినాన్ని పురస్కరించుకొని ఆశన్న గౌడ్ అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గౌడ సంఘం సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు నక్క నాగరాజు గౌడ్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు జయరాజు, జిల్లా చేతివృత్తి సంఘాల నాయకులు నర్సింలు హాజరై మాట్లాడారు. కల్లుగీత కార్మిక సంఘం 1957లో ప్రారంభమై అనేక పోరాటాల విజయాలు సాధించడం జరిగిందన్నారు. నాటి నుండి నేటి వరకు కల్లుగీత కార్మికుల హక్కులు సాధించుకోవడం కోసం ఎంతో కృషి చేశామన్నారు.వృత్తి రక్షణ కోసం కార్మికుల ఉపాధి కోసం గౌడ కులస్తుల సంక్షేమం కోసం నిరంతరం పోరాటం చేస్తాం అన్నారు.వేలం పాటలను రద్దుచేసి, కల్లు సొసైటీలను ఏర్పాటు చేయడం డీఎస్పీ లైసెన్సులను మంజూరు చేయడం శుభ పరిణామం అన్నారు.ఈత,తాటి చెట్ల పెంపకానికి 560 జీవో ప్రకారం 5 ఎకరాల భూమి ఇవ్వడం , పెన్షన్ మంజూరు చేయడం గీతా కార్మికులు మరణిస్తే ఎక్స్గ్రేషియా ను ప్రభుత్వం ఇవ్వడం , ఈత తాటి చెట్లు నరికి వేసిన వారిపై కేసులు పెట్టించడం , కల్లుగీత పారిశ్రామిక సహకార కార్పొరేషన్ ను ఏర్పాటు చేయడం , ప్రభుత్వంకు కట్టవలసిన మూడు రకాల పన్నులను రద్దు చేయించడం సర్దార్ సర్వాయి పాపన్న జయంతిని వర్ధంతిని అధికారికంగా నిర్వహించడం లైసెన్స్ రెన్యువల్ 10 సంవత్సరాలకు పెంచడం బీసీ కార్పొరేషన్ నుంచి ఆర్థిక సహాయాన్ని అందించడం ఇలా అనేక జీవోలను చట్టాలను సాధించిన ఘనత కల్లుగీత కార్మిక సంఘానిదని వారు గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం గౌడ కులస్తులకు ఎన్నికలలో ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని, అర్హులైన కల్లుగీత కార్మికులందరికీ 4000 పెన్షన్ ఇవ్వాలని, అక్రమ మద్యం బెల్టు షాపులను నిర్మూలించాలని, ప్రతి సొసైటీకి చెట్ల పెంపకానికి ఐదు ఎకరాల భూమి ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో ప్రతి రక్షణ,ఉపాధి,గౌడ సంక్షేమం కోసం ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జంగన్న గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు అంజాగౌడ్, జిల్లా నాయకులు, శ్రీనివాస్ గౌడ్,కృష్ణ గౌడ్,రామా గౌడ్,వెంకటేశం గౌడ్ యాద గౌడ్ భూమా గౌడ్,సతీష్ గౌడ్, చిన్న గౌడ్, మల్లేశం గౌడ్ సత్యనారాయణ గౌడ్ వీరేశం గౌడ్, నవీన్ గౌడ్,రవి గౌడ్,కృష్ణ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# తుఫాన్ ప్రభావం: ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్




సూర్యాపేట: మొంథా తుఫాన్ ప్రభావంతో జిల్లాలో భారీ నుండి అతిభారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అన్ని శాఖల అధికారులు తగిన ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ ఛాంబర్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన, వర్షాల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని నేడు జిల్లాలోని అన్ని పాఠశాలలకు స్థానిక సెలవు ప్రకటించినట్టు తెలిపారు. అలాగే, చేపల వేటకు వెళ్లే జాలర్లను అప్రమత్తం చేయడం, నీరు ప్రవహిస్తున్న రోడ్లు, బ్రిడ్జిలు, కల్వర్టులపై వాహనాల రాకపోకలు తాత్కాలికంగా నిలిపివేయడం జరిగిందని పేర్కొన్నారు. నదులు, చెరువులు, కాలువల వద్ద ఇరిగేషన్, పోలీస్, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖలు నిరంతర పర్యవేక్షణ చేస్తున్నాయని తెలిపారు. ఉదయం టెలికాన్ఫరెన్స్ ద్వారా అన్ని శాఖలను అప్రమత్తం చేశామని, క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించి శిథిలావస్థలో ఉన్న మూడు ఇండ్లను సురక్షిత ప్రాంతాలకు తరలించారని వివరించారు. అన్ని మండల, గ్రామ స్థాయి అధికారులు కార్యాలయాల్లో ఉండి ప్రజలను ముందస్తు హెచ్చరికలు ఇవ్వాలని, ఏ ప్రాణనష్టం, ఆస్తినష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. రాష్ట్ర స్థాయి నుంచి కూడా పలు సూచనలు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర నీటిపారుదల మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి, వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు వి.సి. లు తుఫాన్ నేపథ్యంలో సూచనలు ఇచ్చినట్లు పేర్కొన్నారు. ధాన్యం తడవకుండా కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్ పట్టాలు కప్పివేయాలని రైతులను, నిర్వాహకులను అప్రమత్తం చేసినట్లు కలెక్టర్ వివరించారు. ప్రజల సహాయార్థం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ (ఫోన్ నంబర్: 6281492368) ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎవరైనా ఫిర్యాదులు, అత్యవసర సమాచారం అందించిన వెంటనే స్పందించి తక్షణ సహాయక చర్యలు చేపడతామని చెప్పారు. డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ బృందాలు సూర్యాపేట, కోదాడ, హుజూర్నగర్ ప్రాంతాల్లో సిద్ధంగా ఉన్నాయని, అదనంగా ఉమ్మడి నల్గొండ జిల్లాలో బృందం కూడా అందుబాటులో ఉందని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో జిల్లా యంత్రాంగం సమర్థంగా వ్యవహరించేందుకు సిద్ధంగా ఉందని కలెక్టర్ స్పష్టం చేశారు.

# శ్రీశైలం-హైదరాబాద్ హైవేపై

## వాహనాల దారి మళ్లింపు



నాగర్‌కర్నూల్: భారీ వర్షాల కారణంగా శ్రీశైలం-హైదరాబాద్ జాతీయ రహదారిపై వాహనాలను దారి మళ్లిస్తున్నారు. డిండి ప్రాజెక్టు సమీపంలో జాతీయ రహదారి కోతకు గురైంది. దీంతో హాజీపూర్, చింతపల్లి మీదుగా వాహనాలను దారి మళ్లిస్తున్నారు. కోతకు గురైన ప్రాంతాన్ని నాగర్‌కర్నూల్ ఎస్పీ పరిశీలించారు. దీనిపై జాతీయ విపత్తు నిర్వహణ సంస్థకు అధికారులు సమాచారమిచ్చారు.

# సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా

## "సర్దార్ ఏ150 యూనిటీ మార్చ్"

### జాతీయ సమైక్యత, దేశభక్తి కోసం నవంబర్ 12, 13న సూర్యాపేటలో పాదయాత్రలు







సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక పత్రికా ప్రతినిధి – సూర్యాపేట తేదీ: 29-10-2025: సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా ప్రజలలో జాతీయ సమైక్యత, దేశభక్తిని పెంపొందించేందుకు కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో, మై భారత్ మరియు ఎన్ఎస్ఎస్ సహకారంతో "సర్దార్ ఏ150 యూనిటీ మార్చ్'' కార్యక్రమం నిర్వహించనున్నట్లు రాజ్యసభ సభ్యులు కేసరి దేవ్ సింగ్ జ్వాల తెలిపారు. ఉమ్మడి నల్గొండ జిల్లా ఇన్‌ఛార్జిగా నియమితులైన ఆయన బుధవారం నాడు నల్గొండ, సూర్యాపేట జిల్లాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ౦ సర్దార్ వల్లభాయ్ పటేల్ జాతీయ ఏకతకు ప్రతీక అని, యువతలో దేశభక్తి విలువలను నాటే దిశగా ఈ యూనిటీ మార్చ్ కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం భాగంగా అక్టోబర్ 31 నుండి నవంబర్ 25 వరకు జిల్లాల వారీగా పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా నవంబర్ 12, 13 తేదీలలో సూర్యాపేట జిల్లాలో 8 నుండి 10 కిలోమీటర్ల పాదయాత్రలు జరగనున్నాయి. ఈ పాదయాత్రల్లో కనీసం 500 మంది యువత, విద్యార్థులు పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో కోర్ కమిటీలను ఏర్పాటు చేసి, విశ్రాంత ఐఏఎస్ అధికారులు, యువజన సేవల అధికారి, విద్యా శాఖ అధికారులు, ప్రతినిధులతో సమన్వయం కల్పిస్తున్నట్లు తెలిపారు. అదనంగా, యువతలో స్ఫూర్తి నింపేలా సర్దార్ వల్లభాయ్ పటేల్ జీవిత చరిత్రపై అవగాహన కార్యక్రమాలు, వైద్య శిబిరాలు, యోగా క్యాంపులు, ఎగ్జిబిషన్లు, వర్క్‌షాప్‌లు, డిబేట్ పోటీలు, వీధి నాటకాలు, స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి జిల్లా స్థాయిలో మార్గపటాలు (రూట్ మ్యాప్స్) రూపొందించాలని, సక్రమ ఏర్పాట్లు చేయాలని ఎంపీ కేసరి దేవ్ సింగ్ జ్వాల సూచించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ కే. సీతారామారావు మాట్లాడుతూ ౦ ఎంపీ కేసరి దేవ్ సింగ్ జ్వాల మార్గదర్శకత్వంలో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో సూర్యాపేట జిల్లాలో "సర్దార్ ఏ150 యూనిటీ మార్చ్" విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, జిల్లా క్రీడల అధికారి వెంకట్ రెడ్డి, జిల్లా యువజన అధికారి రాజేష్, జెడ్పీ సీఈఓ అప్పారావు, విద్యా శాఖ అధికారి అశోక్, ఇంటర్‌మీడియట్ అధికారి భాను నాయక్, డీఎంహెచ్ఓ చంద్రశేఖర్, మున్సిపల్ కమిషనర్ హన్మంత రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## ప్రజలు వస్తున్నారు జాగ్రత్త

గత బుధవారం తెల్లవారు జామున ఢిల్లీలోని రోహిణీ ప్రాంతంలో ఢిల్లీ పోలీసులు జరిపిన ఒక ఎన్‌కౌంటర్‌లో బిహార్‌కు చెందిన నలుగురు కరడుగట్టిన క్రిమినల్స్ మరణించారని వార్తలు వచ్చాయి. సిగ్మా ముఠా పేరిట అనేక హత్యలు, దోపిడీకి పాల్పడిన ఈ నలుగురు బిహార్ ఎన్నికలకు ముందు బీభత్సం సృష్టించనున్నారన్న సమాచారం రావడంతో ఢిల్లీ పోలీసులు అప్రమత్తమై ఈ ఎన్‌కౌంటర్‌ను నిర్వహించారు. ఈ నేరగాళ్లు ఎవరి తరఫున హింసాకాండకు పాల్పడాలని అనుకున్నారు.. ఎవరి సుపారీ తీసుకున్నారు అన్న వివరాలు మాత్రం లభ్యం లేదు. అయితే బిహార్‌లో నవంబర్ మొదటి వారంలో జరిగే ఎన్నికల్లో జరగబోయే హింసాకాండ గురించి ఆందోళనలు మాత్రం కొనసాగుతున్నాయి. నేపాల్‌లో సంభవించిన పరిణామాలు భారత్%-%నేపాల్ సరిహద్దు సమీప ఏడు బిహారీ జిల్లాల్లోని 21 సీట్లపై ప్రభావం చూపవచ్చని భావిస్తున్నారు. కేవలం రెండు దశల్లో జరగాల్సిన ఎన్నికలకుగాను ఇప్పటికే సీఆర్‌పీఎఫ్, బీఎస్ఎఫ్, ఐటీబీపీ తదితర బలగాలకు చెందిన లక్ష మందిని బిహార్‌లో మోహరించారు. దేశంలో ఇంకెక్కడైనా ఎన్నికలు జరగడం ఒక ఎత్తు, బిహార్‌లో ఎన్నికలు జరగడం ఒక ఎత్తు అని అభివర్ణించిన ఎన్నికల కమిషన్ 4.5 లక్షల మంది పోలింగ్ సిబ్బంది, 2.5 లక్షల మంది పోలీసు అధికారులతో పాటు 470 మంది కేంద్ర పరిశీలకులను నియమించింది. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలోనూ ఇతర రాష్ట్రాలకు చెందిన ఐఏఎస్ అధికారులను నియమించామని వారే తమ కళ్లు చెవులుగా వ్యవహరిస్తారని కమిషన్ ప్రకటించింది. ఈ పరిణామాలను బట్టి చూస్తే కేంద్రంలో అధికారం నెరపుతున్న నరేంద్రమోదీ ప్రభుత్వం బిహార్ ఎన్నికలకు ఎంత ప్రాధాన్యమిస్తున్నదో విశదమవుతోంది. రాష్ట్ర క్రైమ్ రికార్డ్ బ్యూరో ప్రకారమే ప్రతి నెలా సగటున 229 హత్యలు జరిగే బిహార్‌లో 20 సంవత్సరాలుగా నితీశ్ కుమార్ ముఖ్యమంత్రిగా ఉన్నా పరిస్థితిలో పెద్దగా మార్పు లేదు. హత్యలు, దోపిడీలు, కిడ్నాప్‌లు జరగని రోజు లేదు. బిహార్‌లో 60 శాతం జనాభా 30 ఏళ్ల వయసులో ఉన్నారని, వారికే ఉద్యోగమూ లేనప్పుడు శాంతిభద్రతల సమస్య రాకుండా ఎలా ఉంటుంది.. అని ఆ రాష్ట్ర అదనపు పోలీసు డైరెక్టర్ జనరల్ ఒకరు వ్యాఖ్యానించారు. బిహార్‌లో ప్రస్తుత నేర న్యాయ విచారణ వ్యవస్థ నేరాలను అరికట్టగల స్థితిలో లేదని పోలీసు ఉన్నతాధికారులే ఒప్పుకుంటున్నారు. బిహార్‌లో ఉపాధి దొరకని లక్షలాది యువజనులు ఇతర రాష్ట్రాలకు వలసవెళుతున్నారు. ఒక అంచనా ప్రకారం 74.5 లక్షలమంది బిహారీలు తమ రాష్ట్రానికి వెలుపల పనిచేస్తున్నారు. బిహార్‌లో ఉపాధి కల్పన ఎంత ఘోరంగా ఉన్నదో అంచనా వేసేందుకు ఛట్ పూజకు హాజరయ్యేందుకు ఆ రాష్ట్రానికి లక్షల సంఖ్యలో ప్రజలు తిరిగి వచ్చిన తీరే నిదర్శనం. ప్రతి రాష్ట్రం నుంచీ బిహారీలు తిరిగి వచ్చేందుకు రైల్వే మంత్రిత్వ శాఖ 12వేల ప్రత్యేక రైళ్లు నడిపినా ప్రతి రైలూ కిక్కిరిసిపోయింది. నిలబడేందుకు కనీసం చోటు కూడా లేకపోవడంతో అశేష జనం ప్రాణాలకు తెగించి రైళ్లపై కూర్చుని ప్రయాణించారు. 'నేను గత నాలుగు రోజులుగా కేవలం రెండుసార్లే భోజనం చేశాను. సామాను పోతుందన్న భయంతో నిద్ర కూడా పోలేదు. టాయిలెట్‌లో కూడా జనం నిండిపోవడంతో 30 గంటల పాటు మూత్రం చేయలేకపోయాను.. ప్రతి ఏడాదీ ఇదే పరిస్థితి ఎదుర్కొంటున్నాను' అని బిహారీ కార్మికుడు ఒకరు చెప్పారు. ఇవన్నీ చూస్తుంటే బిహార్ అసలు ఈ దేశంలోనే ఉన్నదా.. అని సందేహం వస్తుంది. 4 ట్రిలియన్ డాలర్లతో ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగామని, జపాన్‌ను సైతం అధిగమించామని సంతోషిస్తున్నవారు బిహార్‌లో పరిస్థితి చూస్తే విషాదంలో కూరుకుపోకతప్పదు. దాదాపు 20 సంవత్సరాల క్రితం లాలూప్రసాద్ యాదవ్ నేతృత్వంలోని ప్రభుత్వంలో ఆటవిక రాజ్యం ఉన్నదని బీజేపీ తీవ్ర ప్రచారం చేసింది. 2005 సంవత్సరం నుంచీ బిహార్‌లో జనతాదళ్ (యు) అధికారంలో ఉన్నది. అందులో 15 సంవత్సరాలు బీజేపీ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్నది. ఇంత సుస్థిరత ఉన్న బిహార్ దేశంలో అత్యంత నిరుపేద రాష్ట్రంగా ఎందుకు మిగిలిపోయింది? ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి నివేదిక ప్రకారం సామాజిక అభివృద్ధి, ప్రజారోగ్య వ్యవస్థ పనితీరు, పాఠశాల విద్యానాణ్యత, సుపరిపాలనా సూచికల్లోను బిహార్ అధమ స్థానంలో ఉన్నది. మూడు సంవత్సరాల క్రితం రైల్వేలో 35వేల ఉద్యోగాల కోసం కోటిమందికి పైగా దరఖాస్తు చేసుకున్నారు. ఉద్యోగాల ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా జరగలేదన్న ఆగ్రహంతో విద్యార్థులు బిహార్‌లో అనేక ప్రాంతాల్లో రైళ్లను ఆపి బోగీలకు నిప్పంటించారు. అనేక చోట్ల కాల్పులు జరపాల్సి వచ్చింది. ఎన్నికలకు ముందు ప్రతి పార్టీ పెద్ద ఎత్తున ఉద్యోగాలను కల్పిస్తామని హామీ ఇస్తుంది. అయితే ఆ హామీలు రాజకీయ నినాదాలుగా మాత్రమే మిగిలిపోతాయి. బిహార్‌లోనే అత్యధిక శాతం మంది పేదరికం, నిరుద్యోగంలోనూ కునారిల్లుతున్నారని ప్రపంచ బ్యాంకు నివేదిక వెల్లడించింది. బిహార్ స్థూల దేశీయోత్పత్తి, తలసరి ఆదాయం దేశంలోని అన్ని రాష్ట్రాలకంటే తక్కువ. నీతీ ఆయోగ్ నివేదిక ప్రకారమే దేశంలో అత్యంత ఘోరమైన ఆర్థిక పరిస్థితి ఉన్న రాష్ట్రం బిహార్. రెండేళ్ల క్రితం జరిగిన కుల సర్వే ప్రకారమే దాదాపు 94 లక్షలమంది రోజుకు రూ. 200 కంటే తక్కువ ఆదాయంతో జీవిస్తున్నారు. అక్కడ 12వ తరగతి పూర్తి చేసినవారు కేవలం 10 శాతం మంది మాత్రమే! దారిద్ర్యం, వలసలు, పాలనా వైఫల్యాలు, హింసాకాండ, కులతత్వం, అవినీతి, ప్రజలను ఉచితాలతో మభ్యపెట్టడం, పేలవమైన విద్యావ్యవస్థ చుట్టూ తిరుగుతున్న బిహార్ రాజకీయాలే ఆ రాష్ట్రం ఆర్థికంగా పరివర్తనం చెందకపోవడానికి కారణం. కుల ఆధారిత, ప్రాంతీయ పార్టీలకు బిహార్‌ను వదిలేసి కాంగ్రెస్ చేతులెత్తేస్తే బీజేపీ ఆ రాష్ట్రంలో ఉనికిని నిరూపించుకోవడానికి నానా కష్టాలు పడుతూ సంకీర్ణ ప్రభుత్వాన్ని ప్రోత్సహించక తప్పని పరిస్థితిలో ఉన్నది.

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఇంటింటి ప్రచారం

### మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎమ్మెల్యే సంజీవరెడ్డి ముందుండి ప్రజలకు పిలుపు







సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 29అక్టోబర్: హైదరాబాద్, అక్టోబర్ 29: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయం కోసం పార్టీ శ్రేణులు కృషి చేస్తున్నాయి. %+ఎవీజ% పరిధిలోని జూబ్లీహిల్స్ డివిజన్‌లో ఇంటింటి ప్రచారంలో భాగంగా తెలంగాణ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి కలిసి ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో పాల్గొన్న నేతలు మాట్లాడుతూ, జూబ్లీహిల్స్ ప్రజలు అభివృద్ధి, పారదర్శక పాలన కోసం కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ ఇంటింటి ప్రచార కార్యక్రమంలో నారాయణఖేడ్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ ముఖ్య నాయకులు పాల్గొన్నారు. వారిలో దారం శంకర్ సెట్ (మున్సిపల్ వైస్ ఛైర్మన్), శివ రాథోడ్ (తెలంగాణ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు), తాహెర్ అలీ (మండల కాంగ్రెస్ అధ్యక్షుడు), సిద్ధ రెడ్డి (నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు), పండరి రెడ్డి, ముంతాజ్ సెట్ (మాజీ ఎంపీటీసీ), మజీద్ (మాజీ కౌన్సిలర్), దిల్దార్ ఖాన్, షారుకాన్ (యూత్ కాంగ్రెస్ నాయకులు), సంజీవ్ పాటిల్, గౌస్ చిస్తి, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు. నాయకులు జూబ్లీహిల్స్ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ ౦ రాష్ట్రంలో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి కొనసాగించేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, అందుకే నవీన్ యాదవ్ విజయాన్ని ఖాయం చేయాలని పిలుపునిచ్చారు.

# ఏలూరులో నవజాత శిశువు

**శిశు విక్రయం కేసులో పురోగతి**
**గుర్తించి తీసుకువచ్చిన నల్లగొండ పోలీసులు**
**శిశువు తండ్రి, కొనుగోలు చేసిన దంపతుల విచారణ**



నల్లగొండ, అఅక్టోబరు29(సందేశం టైమ్స్):కడుపున పుట్టిన ఆడపిల్లను కన్నవారే విక్రయించిన ఘటనలో చిన్నారిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరుకు చెందిన దంపతుల వద్ద పోలీసులు గుర్తించారు. శిశువు సహా ఆ దంపతులను నల్లగొండకు తీసుకువచ్చి విచారిస్తున్నట్లు తెలిసింది. నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండలం ఎల్లాపురం తండాకు చెందిన కొర్ర బాబు, పార్వతి దంపతుల సంతానమైన ఆడ శిశువును రూ.3 లక్షలకు విక్రయించారనే విషయం బయటకు పొక్కడంతో ఐసీడీఎస్ అధికారులు, నల్లగొండ పోలీసులు వెంటనే స్పందించారు. ఈ ఘటనపై మధ్యాహ్నమే ఐసీడీఎస్ అధికారుల ఫిర్యాదు మేరకు చిన్నారి తల్లిదండ్రులపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ మొదలుపెట్టారు. ఏలూరు జిల్లా కేంద్రానికి చెందిన సాంబమూర్తి, రజిత దంపతుల వద్ద శిశువు ఉన్నట్లు గుర్తించి అక్కడికి వెళ్లి వారిని బిడ్డ సహా నల్లగొండకు తీసుకువచ్చారు. శిశువు తండ్రి కొర్ర బాబును, ఏలూరుకు చెందిన దంపతులను పోలీసులు ఐసీడీఎస్ అధికారులతో కలిసి విచారణ చేస్తున్నట్లు తెలిసింది. గుంటూరుకు చెందిన ఆటోడ్రైవర్ కొండలు మధ్యవర్తిత్వంతో సాంబమూర్తి దంపతులను కొర్ర బాబు దంపతులు కలిసి శిశువును అప్పగించే విషయం ఫోన్‌లో మాట్లాడుకున్నట్లు తెలిసింది. ఈ నెల 25వ తేదీ రాత్రి 8 గంటల సమయంలో సాగర్ సమీపంలోని సమ్మక్క సారక్క ఆలయం వద్ద కొర్ర బాబు తమ బిడ్డను ఏలూరు దంపతులకు అప్పగించినట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చారు.

# రైతు కంట కన్నీరు



ఇంటర్నెట్ డెస్క్:అక్టోబరు29(సందేశం టైమ్స్): తుఫాను ప్రభావంతో అనేక జిల్లాల్లో పంట నీటిపాలైంది. పశ్చిమగోదావరి జిల్లాలో 3600 ఎకరాల్లో వరిపంట నేలకొరిగింది. ఏలూరు జిల్లాలో 1506.71 హెక్టార్లలో వరి, మినుము పంట చేలు నేలకొరగటంతోపాటు ముంపునకు గురయ్యాయి. విజయనగరం జిల్లా వేపాడ మండలంలో సుమారు 200 ఎకరాల్లో వరి పంట నీటి మునిగినట్టు అంచనా వేశారు. పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లో బొప్పాయి, అరటి పంటలకు నష్టం వాటిల్లింది. గుంటూరు జిల్లాలోని తాడేపల్లి, మంగళగిరి, దుగ్గిరాల, తెనాలి, కొల్లిపర, పొన్నూరు, బాపట్ల జిల్లాలోని కొల్లూరు, భట్టిప్రోలు, వేమూరు, చుండూరు, అమృతలూరు మండలాల్లో అక్కడక్కడ వరి చాపలా నేలపై పరుచుకుపోయింది. అరటి, తమలపాకు, బొప్పాయి తోటలు నేలవాలాయి. శ్రీకాకుళం జిల్లా వ్యాప్తంగా 350 హెక్టార్లలో వరి పంట నీట మునిగిందని.. ఇంకా మరింత పెరిగే అవకాశముందని ప్రాథమిక సమాచారం అందింది. ఉద్దానం ప్రాంతంలో కొబ్బరి, మామిడి, జీడిమామిడి, అరటి మొక్కలు నేలకొరిగిపోయాయి.

# నిలిచిన ప్రజా రవాణా



అమరావతి అక్టోబరు29(సందేశం టైమ్స్): మొంథా తుఫాను ప్రభావిత తీర ప్రాంత జిల్లాల కు ఆర్టీసీ బస్సు సర్వీసులు ఎక్కువ శాతం రద్దయ్యాయి. అరకొరగా నడిచినా అవీ ఖాళీగా కనిపించాయి. నిత్యం కిటకిటలాడే విజయవాడ ఆర్టీసీ బస్టాండ్ జనం లేక బోసిపోయింది. రిజర్వేషన్ చేసుకున్న వారు సైతం ప్రయాణాలను రద్దు చేసుకొన్నారు. హైదరాబాద్, కర్నూలు, తిరుపతి వైపు వెళ్లే బస్సుల్లో తక్కువగానే ప్రయాణికులు కనిపించారు. రాజమహేంద్రవరం, కాకినాడ, విశాఖపట్నం, ఉభయ గోదావరి జిల్లాల్లోని పలు ప్రాంతాలకు బస్సు సర్వీసులను రద్దు చేసినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. కృష్ణా జిల్లాలో మాత్రం వాతావరణం అనుకూలంగా ఉన్న ప్రాంతాలకు బస్సులు నడిపారు. ప్రతి రోజూ 400కుపైగా బస్సులు తిరిగే విజయవాడ బస్టాండ్ నుంచి మంగళవారం 230 బస్సులు మాత్రమే తిరిగాయి. తుఫాను తీవ్రత నేపథ్యంలో ప్రయాణికుల భద్రతతో పాటు సంస్థకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు అధికారులను ఆదేశించారు. దీంతో ఆర్టీసీ మొంథా ప్రభావిత ప్రాంతాల బస్సులు రద్దు చేసి ప్రయాణీకులకు ముందస్తు సందేశాలు పంపించింది.

# అన్న క్యాంటీన్ నెట్‌వర్క్‌తో ఆహారం పంపిణీ



మంగళగిరిఅక్టోబరు29(సందేశం టైమ్స్): రాష్ట్రంలోని 'అన్న క్యాంటీన్' నెట్‌వర్క్‌ను వినియోగించుకుని తుఫాను ప్రభావిత ప్రాంతాలు, పునరావాస కేంద్రాలకు ఆహారం పంపిణీ చేసేందుకు హరే కృష్ణ మూవ్‌వెంట్ చారిటబుల్ ఫౌండేషన్ చర్యలు చేపట్టింది. ఈమేరకు ఫౌండేషన్ ఏపీ సెంట్రల్ రీజియన్ ఉపాధ్యక్షుడు విలాస దాస గుంటూరు జిల్లా మంగళగిరిలోని అక్షయపాత్ర కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. పునరావాస కేంద్రాలకు అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రాత్రి భోజనం అందించే చర్యలు చేపట్టామన్నారు. కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ఏలూరు, కోనసీమ జిల్లాల్లో ఈ కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఇతర వివరాలకు రఘునందన్ దాన, సెల్: 7386713300 నంబరులో సంప్రదించాలని సూచించారు.

# మొంథా అలజడి



అక్టోబరు29(సందేశం టైమ్స్)::కొవ్వూరు అనుకున్న విధంగానే మొంథా తుపాను జిల్లాలో అల్లకల్లోలం సృష్టించింది. జిల్లా వ్యాప్తంగా 361 కుటుంబాలకు చెందిన 1193 మందిని పునరవాస కేంద్రాలకు అధికారులు తరలించారు. లోతట్టు ప్రాంతంలో ఉండే వాళ్లతో పాటు శిథిలావస్థకు చేరుకున్న ఇళ్లల్లో నివాసం ఉంటున్న వారిని, తాటాకు పాకల్లో ఉంటున్న వారిని ముందస్తు జాగ్రత్తగా పునరావాస కేంద్రాలకు తరలించారు. కొవ్వూరు 9, రాజమహేంద్రవ రంలో మూడు పునరావాస కేంద్రాలు ఏర్పా టు చేశారు. మొంథా తుపాను ప్రభావం ఎక్కువగా ఉన్న మండలాల్లో అధికారులు, ప్రజా ప్రతినిధులు నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఎక్కడికక్కడే వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. విద్యుత్ పునరుద్ధణ జిల్లా వ్యాప్తంగా 1200 మంది అదనపు సిబ్బందిని నియమించారు. 12 క్రేన్లతో పాటు 1500 స్తంభాలను అందుబాటులో ఉంచినట్లు ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ తిలక్‌కుమార్ తెలిపారు.కొవ్వూరు డివిజన్ పరిధిలో మొత్తం 8 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. మద్దూరు, కొవ్వూరు, నల్లజర్ల, దూబచెర్ల, ఖండవల్లి, పెరవలి, నిడదవోలు ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలలను తాత్కాలిక శిబిరాలుగా మార్చి అవసరమైన సౌకర్యాలను సమకూర్చారు. ఈ కేంద్రాల్లో 264 కుటుంబాలకు చెందిన 912 మంది ప్రజలు ప్రస్తుతం ఆశ్రయం పొందుతున్నట్లు ఆర్‌డిఒ రాణి సుస్మిత తెలిపారు తహశీల్దార్లు, మండలాధికారులు వ్యక్తిగతంగా శిబిరాలను పర్యవేక్షిస్తూ అవసరమైన సహాయాన్ని అందిస్తున్నారు.రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలోని కాతేరు, హుకుంపేట ప్రాంతాల్లో 3 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ శిబిరాల్లో 97 కుటుంబాలకు చెందిన 281 మంది ప్రజలు తాత్కాలిక నివాసం పొందుతున్నారు. విద్యుత్, పరిశుభ్రత, వైద్య సేవలు, తాగునీటి సరఫరా వంటి సౌకర్యాలను నిరంతరంగా నిర్వహించేలా కృషి చేసినట్లు అధికారులు ప్రకటించారు. గాలి తీవ్రతపై ముందస్తు సమాచారంమొంథా తుపాను ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా 272 రెవెన్యూ గ్రామాల వారీగా 28, 29 తేదీల్లో నమోదు అయ్యే వర్షపాతం, గాలి తీవ్రత వివరాలను మండల స్థాయి అధికారులు ముందస్తు సమాచారం ఇచ్చారు. గ్రామ స్థాయిలో తగిన ప్రణాళికలను రూపొందించాలని కలెక్టర్ కీర్తి చేకూరి సూచించారు. గాలుల తీవ్రత ఎక్కువగా ఉ ండే ప్రాంతాల్లో వాతావరణ శాఖ హెచ్చరికలను పరిగణన లోకి తీసుకుని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆమె విజ్ఞప్తి చేశారు.కొవ్వూరులో కూలిన చెట్లు మొంథా తుపానుతో కొవ్వూరు టౌన్‌లో మున్సి పల్ కార్యాలయం దగ్గర ఆటోపై చెట్టు విరిగి పడింది. ఆర్‌టిసి గ్యారేజ్ వెనుక వీధిలో చెట్టు తిరిగి విద్యుత్ తీగలపై పడింది. దీంతో స్తంభం కూలిపోయింది. మున్సి పల్ కమిషనర్ సిహెచ్ వెంకటేశ్వర్లు ఇతర సిబ్బంది దగ్గరుండి చెట్టు తొలగింపు చర్యలు చేపట్టారు. విద్యుత్ శాఖ అధికారులు యుద్ధ ప్రాతిపదికన కూలిన స్థంభం స్థానంలో మరొక స్తంభం ఏర్పాటు చేశారు. దీంతో పట్టణంలో పలు ప్రాంతాల్లో సుమారు రెండు గంటలకు పైగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అవంతి ఫ్యాక్టరీ సమీపంలోనూ ఔరంగాబాద్ లోనూ రెండు చెట్లు కూలిపోయాయి. అవంతి సమీపంలో విద్యుత్ తీగలపై పడడంతో సరఫరాకు అంతరాయం ఏర్పడింది. నిలిచిన ఇసుక తవ్వకాలు తుపాను ప్రభావంతో గోదావరి నదిలో ఇసుక తవ్వకాలు నిలిచిపోయాయి. గాలుల తీవ్రత భారీగా పెరగడంతో పడవలను పూర్తిగా నిలిపివేశారు. గాలుల ప్రభావానికి నదిలో అలలు ఎగిసిపడుతున్నాయి. బుధవారం కూడా ఇసుక తవ్వకాలు కొనసాగే పరిస్థితి పరిస్థితి లేదు.

# నర్సరీ రైతులకు అసోసియేషన్ సేవలు



కడియం అక్టోబరు29(సందేశం టైమ్స్):: తుపాను ప్రభావంతో ఇబ్బందులను ఎదుర్కొనే రైతులకు నర్సరీ అసోసియేషన్ సేవలు అందించేందుకు సిద్ధంగా ఉందని అసోసియేషన్ అధ్యక్షులు రత్నం అయ్యప్ప తెలిపారు. దామిరెడ్డి పల్లి నుంచి దుళ్ల వెళ్లే మార్గంలో కూలిన చెట్టును తక్షణం జెసిబి సాయంతో నర్సరీ అసోసియేషన్ తొలగించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరో మూడు రోజులు పాటు మూడు జెసిబిలు అసోసియేషన్ కార్యాలయం వద్ద అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఎక్కడైనా చెట్లు కూలినా, నర్సరీల్లో నీరు నిల్వ ఉండిపోయినా అసోసియేషన్‌కు సమాచారం ఇవ్వాలని అన్నారు.

# సంగం పెన్నా వారధి వద్ద తప్పిన పెను ప్రమాదం..



నెల్లూరు:అక్టోబరు29(సందేశం టైమ్స్): మొంథా తుఫాన్ కారణంగా రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు ప్రజలను అతలాకుతలం చేస్తున్నాయి. మరోవైపు వర్షాలకు పెన్నానది ఉగ్రరూపం దాలుస్తోంది. ఈ క్రమంలో సంగం పెన్నా వారధి వద్ద పెను ప్రమాదం తప్పింది. పెన్నా నది నుంచి ఇసుక తరలించేందుకు నిల్వ ఉంచిన మూడు పడవలు.. భారీగా నీరు రావడంతో తాళ్ళు తెంచుకొని పెన్నానది గట్టున నిలిచాయి. అయితే ఆ పడవలు పెన్నా వారధి గేట్లకు తగలకపోవడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. అవి గేట్లకు తగిలి ఉ ంటే పెద్ద ప్రమాదమే జరిగి ఉండేదని అధికారులు చెబుతున్నారు.ఏపీలో మొంథా తుఫాన్ తీవ్రరూపం దాల్చుతుంది. దీంతో పలు జిల్లాల్లో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఇప్పటికే కురుస్తున్న వర్షాలకు జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో చెట్లు నేలకొరుగాయి. విద్యుత్ స్తంభాలు విరిగి రోడ్డుపై పడ్డాయి. పలు కాలనీలకు భారీగా వరద నీరు చేరడంతో.. జలదిగ్బంధంలో ఇరుక్కున్నాయి. పలు చోట్లు వాగులు, కాలువలు పొంగిపొర్లుతున్నాయి. వరద నీరు రోడ్లపైకి వచ్చి చేరడంతో.. గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి,

# 11 కిలోల గంజాయితో మహిళ అరెస్టు



పలాస, అక్టోబరు29(సందేశం టైమ్స్): స్థానిక రైల్వేస్టేషన్ వద్ద అనుమానాస్పదంగా తిరుగు తున్న ఓ మహిళ నుంచి 11 కిలోల గంజాయిని ఆర్పీఎఫ్, రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు రైల్వే పోలీసు స్టేషన్ వద్ద ఎస్ఐ ఎ.కోటేశ్వరరావు ఇందుకు సంబం ధించిన వివరాలను వెల్లడించారు. ఆర్పీఎఫ్ ఎస్ఐ మాల్యాద్రి, తన సిబ్బందితో రైల్వేప్లాట్ ఫారంపై తనిఖీ చేస్తుండగా ఓ మహిళ ట్రాలీబ్యాగుతో అనుమానస్పదంగా కనిపించింది. ఆమెను ప్రశ్నించడంతో గంజాయి విషయం బయట ప డింది. గజపతి జిల్లా గులుబ గ్రామానికి చెందిన మిక్కి కుమారి మల్లిక్ ఒడిశా లో కునుహు అనే వ్యక్తి నుంచి గంజాయి సేకరించింది. విజయవాడ మీదుగా ముంబాయికి తరలించేందుకు రూ.10వేలు ఇస్తామని చెప్పడంతో ఆమె రవాణా చేసేందుకు సిద్ధమైంది. ఈ క్రమంలో పోలీసులకు దొరికిపోయింది. దీంతో ఆమె ను విశాఖ రైల్వేకోర్టులో హాజరుపరచనున్నట్టు ఎస్ఐ తెలిపారు.

## అరుదైన బల్లిజాతిని గుర్తించారు.

మంగళం, అక్టోబరు29(సందేశం టైమ్స్): తిరుమల కొండల్లో అరుదైన ఒక బల్లిజాతిని గుర్తించారు. దట్టమైన చందనపు అడవిలో చెట్టు బెరడు కింద దీనిని జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా శాస్త్రవేత్తలు గుర్తించారు. దీనికి వెంకటాద్రి స్లెండర్ గెక్కో అని పేరు కూడా పెట్టారు. పలుచని తొండలా కనిపించే బల్లిజాతి జీవి ఇది. హెర్పటోజోవా అనే అంతర్జాతీయ జర్నల్‌లో ఈ వివరాలను శాస్త్రవేత్తలు ప్రకటించారు. హైదరాబాద్‌కు చెందిన ఫ్రెష్‌వాటర్ బయాలజీ రీజనల్ సెంటర్, కోల్‌కత్తకి చెందిన రెప్టైల్ల విభాగం, ఒడిస్సాలోని ఫకీర్ మోహన్ యూనివర్శిటీల శాస్త్రవేత్తల బృందం శేషాచలం అడవుల్లో దీనిని గుర్తించింది.



## కెజిబివిలో విద్యుత్తు షార్ట్ సర్క్యూట్

గుర్ల అక్టోబరు29(సందేశం టైమ్స్): మండలంలోని కస్తూరిబా గురుకుల పాఠశాలలో సాయంత్రం విద్యుత్ షార్టు సర్క్యూట్ జరిగింది. సెకెండ్ ఇంటర్ చదువుతున్న విద్యార్థినుల గదిలో ఒక్కసారిగా మంటలు వచ్చి ఫ్యాన్లు, డార్మిటరీలో పరుపులు కాలిపోవడంతో విద్యార్థులు వెంటనే నీళ్లు జల్లారు. దీంతో ఒక్కసారిగా మంటలు ఎక్కువై పోవడంతో ఐదుగురు వై శ్రావణి , జె.సుజాత, ఇ.వెంకటలక్ష్మి, జి.కృపా సంధ్య, కె.దీక్షిత అస్వస్థతకు గురయ్యారు. వెంటనే సిబ్బంది పోలీసులకు సమాచారం అందించడంత 108 వాహనంలో విజయనగరం, నెల్లిమర్ల ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుత వారంతా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారి ఆరోగ్య పరిస్థితి నిలడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. తుపాను నేపథ్యంలో రెండు రోజులుగా భారీ వర్షాలు ఉండడంతో ఈ ప్రమాదం సంభవించినట్లు పాఠశాల ఎస్ఒ జానకి తెలిపారు. చీపురుపల్లి సిఐ శంకర రావు, గుర్ల ఎస్ఐ నారాయణరావు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.కెజిబివి విద్యార్థులు క్షేమంగా ఉన్నారని కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి తెలిపారు.డార్మెటరీలో పరుపులు అంటుకొని వచ్చిన పొగతో ఐదుగురు విద్యార్థులు స్వల్ప అస్వస్థతకు గురి అయ్యారని తెలిపారు. వెంటనే వారిని నెల్లిమర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించడంతో ఆరోగ్యం మెరుగుపడిందని తెలిపారు. ఈ సంఘటనపై మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆరా తీశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు.



## ప్రభుత్వ కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి : సిపిఎం



అక్టోబరు29(సందేశం టైమ్స్):పెనుగొండ వర్షం వస్తే చాలు రోడ్లపై నీరు నిలిచి అనేక ఇబ్బందులు పడుతున్నామని అడ్డుపుంత కాలనీ వాసులు సిపిఎం నాయకుల వద్ద వాపోయారు. తుపాను సమయంలో కాలనీ ప్రజల పరిస్థితి తెలుసుకోవడానికి వెళ్లిన సిపిఎం మండల కార్యదర్శి ఎస్కె పాదుషా మాట్లాడుతూ గత ఆరేళ్లుగా ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ తిరుగుతున్నా కాలనీలో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. వర్షం వస్తే ఐదు పూర్లాంగులు నడిచి వెళ్లవలసి వస్తుందని కాలనీ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పెనుగొండ అడ్డుపుంత కాలనీ ప్రజల సమస్యలు పరిష్కరించాలని పాదుషా కోరారు. కార్యక్రమంలో కుడిపూడి ప్రసాద్‌రావు, జక్కంశెట్టి రవికుమార్, కర్రి లోవరాజు, సానబోయిన శ్రీనివాసరావు, మహిళలు పాల్గొన్నారు.

## ఉర్దూ చదవాలంటే.. ఊరు వదలాల్సిందే..!




**కళాశాల నిర్మాణ పనులు**
**పదో తరగతితోనే చదువును ఆపేస్తున్న విద్యార్థులు**
**మిథ్యగా మారిన ఉర్దూ జూనియర్ కళాశాల**
**ఇంటర్ కోసం 50 కిలోమీటర్లు ప్రయాణించాల్సిందే**
**నత్తనడకన ఉర్దూ ఐటీఐ కళాశాల నిర్మాణం**
**పిల్లల భవిష్యత్తుపై తల్లిదండ్రుల్లో ఆందోళన**

అక్టోబరు29(సందేశం టైమ్స్):ఉర్దూ దక్షిణాసియాలో మాట్లాడే ఇండో–ఆర్యన్ భాష. భారతదేశంలో అధికారికంగా గుర్తించిన భాషల్లో ఉర్దూ ఒకటి. ఉర్దూకు ఎంతో ప్రాముఖ్యత ఉన్నప్పటికీ నేటికీ పలుచోట్ల ఉర్దూను చిన్న చూపు చూస్తున్నారు. ఉర్దూ మీడియం స్కూళ్లు ఉన్నా కాలేజీలు మాత్రం చాలా తక్కువ అనే చెప్పవచ్చు. నంద్యాల జిల్లాలోని ఆళ్లగడ్డ పరిసర మండలాల విద్యార్థులు ఉర్దూ మీడియంలో ఇంటర్మీడియట్ చదవాలంటే ఊరి వదలాల్సిన పరిస్థితి నెలకొంది. ఉర్దూను ఎక్కువగా మైనార్టీ విద్యార్థులు (బాల, బాలికలు) చదువుతారు. ముఖ్యంగా బాలికలు పదో తరగతి వరకు ఆయా మండలాల్లో ఉన్న ఉర్దూ పాఠశాలల్లో చదువును కొనసాగించి చదువులను ఆపేస్తున్నారు. కారణం దగ్గర్లో సరైన ఉర్దూ జూనియర్ కళాశాలలు లేకపోవడమే. దీంతో తల్లిదండ్రులు తమ పిల్లలను బయటికి పంపలేక వారి భవిష్యత్తుపై ఆందోళన చెందుతున్నారు. నియోజకవర్గంలో ఉర్దూ చదువుకునే విద్యార్థులకు పదో తరగతి వరకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు. ఇక ఇంటర్‌లో చేరాలంటే అసలు సమస్య. ఎం దుకంటే ఆళ్లగడ్డ నుంచి అటు.. ఇటుగా ఇంటర్ కళాశాలలు. దాదాపు 50కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. నంద్యాలకు రావాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఉర్దూ కళాశాల విద్య మిథ్యగా మారింది. చాలామంది ముస్లిం మైనార్టీ విద్యార్థులు చేసేదేమీ లేక చదువు మానుకొని ఇంటి పనులకు పరిమితమౌతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మైనార్టీల విద్యాభివృద్ధి కోసం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలు ఇవ్వడం లేదు.

## సామర్లకోటలో వందేళ్ల నాటి శిథిల భవనం కూల్చివేత

సామర్లకోట, అక్టోబరు29(సందేశం టైమ్స్): కాకినాడ జిల్లా సామర్లకోట పట్టణ నడి బొడ్డున వందేళ్ల నాటి భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరి ఎప్పుడు కూలుతుందో తెలి యని పరిస్థితి ఏర్పడింది. మొంథా తుఫాన్ ప్రభావం భయానక పరిస్థితుల కారణంగా కూల్చివేశారు. పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకా యల చినరాజప్ప స్పందించి మున్సిపల్ అధి కారులతో తక్షణం కూల్చి వేయాలని ఆదేశం చడంతో సాయంత్రం క్రేన్ స హాయంతో కూల్చివేత పనులు నిర్వహించారు.



## పత్తి కొనుగోలుకు గ్రీన్ సిగ్నల్

కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు29(సందేశం టైమ్స్): రాష్ట్రంలోనే అత్యధికంగా దాదాపు 5.40 లక్షల ఎకరాల్లో కర్నూలు జిల్లాలో సాగైన పత్తి పంట రైతుల చేతికి వచ్చింది. ఈ పంటను ఎప్పుడెప్పుడు సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకునేందుకు రైతులు ఎదురు చూస్తున్నారు. కేంద్రం కింటానికి రూ.8,110 మద్దతు ధర ప్రకటించింది. వర్షాలు, తుఫాన్ల నేపథ్యంలో పత్తిని అమ్ముకునేందుకు రైతులు పడుతున్న కష్టాలను గుర్తించిన కూటమి ప్రభుత్వం ఎట్టకేలకు పత్తి కొనుగోళ్లను వెంటనే ప్రారంభించాలని మంగళవారం మార్కెటింగ్ శాఖకు ఉత్తర్వులు ఇచ్చింది. రాష్ట్రం మొత్తం మీద సీసీఐ ఆధ్వర్యంలో 30 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే ఒక్క కర్నూలు జిల్లాలోనే 20 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం విశేషం. కర్నూలు జిల్లాలో 5.40 లక్షల ఎకరాలో ఖరీఫ్ సీజన్‌లో సాగు చేశారు. ఒక ఎకరాలో 8 నుంచి 10 క్వింటళ్ల పత్తి దిగుబడి వస్తుందని, వ్యవసాయ శాఖ యంత్రాంగం అంచనా వేసింది. ఈ లెక్కన 5.40లక్షల టన్నుల పత్తి దిగుబడి రైతుల చేతికి అందే అవకాశం ఉందని వారు అంచనా వేస్తున్నారు. గత రెండు నెలల నుంచి రైతులు సీసీఐ కొనుగోలు కేంద్రాల కోసం కళ్లలో ఒత్తులు పెట్టుకుని ఎదురు చూశారు. ఎట్టకేలకు ప్రభుత్వం రైతుల కష్టాలను గుర్తించి బుధవారం నుంచి పత్తి కొనుగోళ్లకు ఏర్పాట్లు పూర్తి చేసింది. కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి, జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్, ఆదోని, ఎమ్మిగనూరు, కోడుమూరులోని పెంచికలపాడులో ఏర్పాటు చేసిన 20 పత్తి కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. వ్యవసాయ మార్కెటింగ్, సీసీఐ అధికారులు సమన్వయం చేసుకుని రైతుల నుంచి ఎటువంటి ఆటంకాలు లేకుండా కొనుగోలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో పత్తి కొనుగోళ్లు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ముఖ్యంగా ఉమ్మడి జిల్లాలోని 15 మార్కెట్ కమిటీల ఛైర్మన్లు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి పత్తి కొనుగోళ్లను ప్రారంభించేందుకు జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది.



## ఎం.రావిలంకలో కొండచిలువ హతం



దేవీపట్నం,అక్టోబరు29(సందేశం టైమ్స్): అల్లూరి జిల్లా దేవీపట్నం మండలం ఇందు కూరు పంచాయతీ ఎం.రావిలంక గ్రామంలోని ఒక ఇంట్లో రాత్రి కొండ చిలువ హల్‌చల్ చేసింది. దీన్ని గమనించిన స్థాని కులు భయభ్రాంతులకు గురై హతమార్చారు. ఈ కొండచిలువ పొడవు సుమారు 12 అడు గులవరకు ఉంటుందని స్థానికులు తెలిపారు

## సత్యదేవుడి సన్నిధిలో డీఎస్పీల జంట పూజలు



అన్నవరంఅక్టోబరు29(సందేశం టైమ్స్):ఇద్దరు డీఎస్పీలు ప్రేమించి పశ్చిమ గోదావరి జిల్లాలో ఒక్కటైన జంట కాకినాడ జిల్లా అన్నవరం సత్యదేవుడి సన్నిధిలో వ్రతమాచరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రస్తుతం కృష్ణాజిల్లా అవనిగడ్డ డీఎస్పీగా పనిచేస్తున్న విద్యశ్రీ, పల్నాడు జిల్లా గురజాల డీఎస్పీగా పనిచేస్తున్న జగదీష్‌లు గత కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. ఇరుపెద్దల అంగీకారంతో వారు ఒక్కటయ్యారు. వారికి ఆలయ అధికారులు ఏర్పాట్లు చేయగా దర్శనం అనంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. ఒకే క్యాడర్ గల అధికారుల ప్రేమవివాహం విశేషంగా మారింది.

## పనులు కోల్పోయిన పేదల్ని ఆదుకోవాలి

మంగళగిరి రూరల్ అక్టోబరు29(సందేశం టైమ్స్): తుపాను, అధిక వర్షాల వల్ల పనులు కోల్పోయిన వ్యవసాయ కార్మికులకు, వృత్తిదారులకు, అసంఘటిత రంగ కార్మికులకు నిత్యావసర సరుకులను, కుటుంబానికి రూ.20 వేల నగదు, ఉచితంగా గ్యాస్ సిలిండర్ ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మండలంలో ఆత్మకూరులోని నిమ్మగడ్డ రామ్మోహన్‌రావు కాలనీలో సంఘం నాయకులు పర్యటించి వర్షాలు వల్ల పనులు కోల్పోయిన పేదలతో మాట్లాడారు. నెల రోజులుగా తమకు పనులు సరిగా లేవని, వర్షాల వల్ల కొద్దిపాటి పనులు కూడా కోల్పోయామని స్థానికులు చెప్పారు. కుటుంబ పోషణ కోసం అప్పులు చేస్తున్నామని, అయినా తమను పట్టించుకునేవారు లేరని వాపోయారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ తుపాను వల్ల మల్లెపూల తోటలు, వరిపైరు, నిమ్మ తోటలు, పత్తి పొలాలు దెబ్బతిన్నాయని, వీటిని సాగు చేస్తున్న కౌలురైతులు తీవ్రంగా నష్టపోయారని చెప్పారు. చేతికందివచ్చిన పంటమొత్తం నీటిపాలైందని, వీరందరికీ కౌలుగుర్తింపు కార్డుతో సంబంధం లేకుండా ప్రభుత్వం సాయం చేయాలని వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఇ.అప్పారావు, నాయకులు అప్పలస్వామి, సిఐటియు మండల కార్యదర్శి యు.దుర్గారావు పాల్గొన్నారు.



# ప్రయాణికుడి బ్యాగ్‌లో బుల్లెట్..


## భద్రతా సిబ్బంది అలర్ట్

హైదరాబాద్, అఅక్టోబరు29(సందేశం టైమ్స్): రాజీవ్ గాంధీ అంతర్జాతీయ ఎయిర్‌పోర్టులో బుల్లెట్ కలకలం రేపుతోంది. కోల్‌కత్తా నుంచి హైదరాబాద్ వస్తున్న ఓ ప్రయాణికుడి వద్ద బుల్లట్‌ను భద్రతా సిబ్బంది గుర్తించింది. ప్రయాణికుడు విశాల్‌గా గుర్తించారు. అతని వద్ద ఉన్న బ్యాగులో 38 ఎంఎం బుల్లెట్ లభ్యమైంది. వెంటనే విమానాశ్రయ భద్రతా సిబ్బంది అతడిని అదుపులోకి తీసుకుని పోలీసులకు అప్పగించారు. శంషాబాద్ విమానాశ్రయం నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉంటుంది. వివిధ దేశాలు, రాష్ట్రాలకు వెళ్లే ప్రయాణికులు, వీఐపీలు, ప్రముఖులు ఎయిర్‌పోర్టుకు వస్తుంటారు. ఈ క్రమంలో ఎయిర్‌పోర్టులో భద్రత కట్టుదిట్టంగా ఉంటుంది. ప్రతీ ప్రయాణికుడి బ్యాగ్‌లను భద్రతా సిబ్బంది తనిఖీలు చేస్తుంటారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టులో అప్పుడప్పుడూ అక్రమంగా రవాణా చేస్తున్న బంగారం పట్టుబడుతుంటుంది. ఇప్పుడు తాజాగా ఓ ప్రయాణికుడి వద్ద బుల్లెట్ లభించడంతో భద్రతా సిబ్బంది అప్రమత్తమయ్యారు. విశాల్ అనే నిందితుడు కోల్‌కత్తా నుంచి హైదరాబాద్ వస్తూ తన బ్యాగ్‌లో బుల్లెట్‌ను తీసుకుని వచ్చాడు.అయితే అతడు అనుమానాస్పదంగా కనిపించడంతో సెక్యూరిటీ సిబ్బంది తనిఖీ చేయగా... అసలు విషయం బయటపడింది.




వెంటనే నిందితుడిని ఆర్జీఐఏ ఔట్ పోస్టు పోలీసులకు అప్పగించారు. బుల్లెట్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు.. కేసు నమోదు చేసిన దర్యాప్తు చేపట్టారు. నిందితుడు బుల్లెట్‌ను ఎక్కడి నుంచి తీసుకువచ్చాడు.. అతడికి బుల్లెట్‌ను ఎవరు ఇచ్చారు.. బుల్లెట్ తీసుకురావడానికి గల కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. అయితే అంతర్జాతీయ ఎయిర్‌పోర్టులో బుల్లెట్ లభ్యంకావడంతో ప్రయాణికులు ఒకింత ఆందోళనకు గురయ్యారు.

# కరీంనగర్‌లో వైద్యుడి ఆత్మహత్య



కరీంనగర్ క్రైంఅక్టోబరు29(సందేశం టైమ్స్): స్నేహితులు తన వద్ద తీసుకున్న అప్పులు తిరిగి చెల్లించకపోవడంతో మనస్తాపం చెంది కరీంనగర్‌కు చెందిన డాక్టర్ ఎంపటి శ్రీనివాస్ (42) అనే వైద్యుడు ఆత్మహత్య చేసుకున్నారు. డాక్టర్ శీనివాస్ నగునూర్‌లోని ప్రతిమ వైద్య కళాశాలలో అనస్థీషియా పీజీ రెండో సంవత్సరం చేస్తున్నారు. కరీంనగర్‌కు చెందిన వింజనురి కరుణాకర్ డాక్టర్ శ్రీనివాస్ వద్ద రూ. 1.50 కోట్లు అప్పుగా తీసుకున్నాడు. అలాగే, కిరణ్, కవిత, వెంకటి నరహరి అనే ముగ్గురు స్నేహితులు శ్రీనివాస్ పేరిట రూ. 1.35 కోట్లు బ్యాంకులో రుణం తీసుకున్నారు. బంజేరుపల్లికి చెందిన కుమారస్వామి తన వ్యాపారం కోసం శ్రీనివాస్ నుంచి రూ. 28 లక్షలు అప్పుగా తీసుకున్నారు. వీరంతా ఆ డబ్బు తిరిగి చెల్లించకపోవడంతో డాక్టర్ శ్రీనివాస్ బ్యాంకు వాయిదాలు చెల్లించలేకపోయారు. దీంతో బ్యాంకు అధికారుల నుంచి ఒత్తిడి పెరిగింది. అప్పు తీర్చమని స్నేహితులను అడిగితే... డబ్బు ఇవ్వమని, ఏమి చేసుకుంటావో చేసుకో అని బెదిరించారు. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన శ్రీనివాస్ బలవన్మరణానికి పాల్పడ్డారు. శ్రీనివాస్ చేతికి ఇంట్రావీనస్ ఇంజక్షన్ కాన్యులా పెట్టి ఉంది.

# సమాచారం ఇవ్వని అధికారులకు జరిమానా

హైదరాబాద్, అక్టోబరు29(సందేశం టైమ్స్): సమాచార హక్కు చట్టం అమల్లో నిర్లక్ష్యం వహించిన ఇద్దరు ఉన్నతాధికారులకు రాష్ట్ర సమాచార కమిషన్ జరిమానా విధించింది. నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన వివరాలు ఇవ్వాలని ఎన్.జంగయ్య అనే వ్యక్తి 2024 ఫిబ్రవరి 24న నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఎస్ఈ కార్యాలయంలో ఆర్టీఐ యాక్ట్ కింద దరఖాస్తు సమర్పించారు. దానికి సంబంధించిన సమాచారాన్ని నెలరోజుల్లో ఇవ్వాల్సి ఉండగా.. ఏడాది దాటినా ఇవ్వకపోవడంతో ఆయన కమిషన్‌ను ఆశ్రయించారు. దీనిపై కమిషన్ కార్యాలయం డీఈఈ రమణా నాయక్‌కు షోకాజ్ నోటీసు జారీచేసింది. గత నెల 22న స్వయంగా హాజరు కావాలని నోటీసు పంపింది. కానీ, ఆయన గైర్హాజరు అయ్యారు. దీంతో ఆయనకు రూ. 5 వేల జరిమానా విధిస్తూ ఆర్టీఐ కమిషనర్ పి.వి.శ్రీనివాసరావు ఇటివలే ఆదేశాలు జారీచేశారు. మరో కేసులో.. మునిసిపాలిటీకి సంబంధించిన సమాచారం కావాలని జగిత్యాలకు చెందిన ఏ.చంద్రశేఖర్ అనే వ్యక్తి 2022 జనవరిలో దరఖాస్తు చేశారు. దీనిపై కమిషన్ పలుమార్లు ఆదేశించినా సమాచారం ఇవ్వకపోవడంతో దరఖాస్తుదారుకు రూ. 2 వేలు పరిహారంగా చెల్లించాలని జగిత్యాల మునిసిపాలిటీప్రజా సమాచార అధికారికి కమిషనర్ పివి.శ్రీనివాసరావు ఆదేశాలు జారీ చేశారు. సమాచార హక్కు చట్టం అమలులో నిర్లక్ష్యం వహించేఅధికారులపై తీవ్ర చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత.. సమాచార కమిషనర్ ప్రభుత్వ అధికారులకు రూ. 5వేల జరిమానా విధించడం ఇదే ప్రథమం.

# విమానాలకు అంతరాయం



**విజయవాడ, విశాఖ, రాజమండ్రికి రాకపోకలు సాగించే 18 సర్వీసుల రద్దు**

**పలు రైళ్లను రద్దుచేసిన దక్షిణమధ్య రైల్వే**

**రేపు, ఎల్లుండి హైదరాబాద్-విశాఖ మధ్య మరో 3 ఎక్స్‌ప్రెస్ రైళ్ల రద్దు**

**నేడు రాష్ట్రవ్యాప్తంగా భారీ, అతి భారీ వర్షాలు**

హైదరాబాద్, శంషాబాద్ :అక్టోబరు29(సందేశం టైమ్స్): మొంథా తుఫాన్ ప్రభావంతో శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఉదయం నుంచి విజయవాడ, విశాఖపట్నం, రాజమండ్రికి వెళ్లిరావాల్సిన 18 విమాన సర్వీసులు రద్దయ్యాయి. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వచ్చే రెండు మూడు రోజుల్లో ఎవరు కూడా ఈ మూడు ప్రాంతాలకు విమాన టికెట్లు బుక్ చేసుకోవొద్దని ఎయిర్‌లైన్స్ అధికారులు ప్రయాణికులకు విజ్ఞప్తి చేశారు. ఇక ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ 3 విమానాలు, ఇండిగో 15 విమాన సర్వీసులు రద్దయ్యాయి. ప్రయాణికులకు టికెట్ డబ్బులు వాపస్ ఇస్తామని ఎయిర్‌లైన్స్ ప్రకటించారు. తుఫాన్ తీవ్రతను ముందుగానే అంచనా వేసిన దక్షిణమధ్యరైల్వే అధికారులు జోన్ పరిధిలోని 92 రైళ్లను మంగళవారం నుంచే రద్దు చేయగా, తాజాగా బుధ, గురువారాల్లో మరో మూడు ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ముంబై నుంచి హైదరాబాద్ మీదుగా విశాఖపట్నం వెళ్లే (18520) ఎక్స్‌ప్రెసతో పాటు ముంబై-భువనేశ్వర్ మధ్య నడిచే (11019) కోణార్క్, విశాఖపట్నం-మహబూబ్‌నగర్ మార్గంలో నడిచే (12861) ఎక్స్‌ప్రెస్ కూడా రద్దయ్యాయని సీపీఆర్‌వో శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొంథా తుఫాను ప్రభావంతో బుధవారం మంచిర్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం తెలిపింది. ఇక ఆసిఫాబాద్, జగిత్యాల, కరీంనగర్, సిద్ధిపేట, యాదాద్రి భువనగిరి, జనగాం, నాగర్ కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది.

# మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ



హైదరాబాద్/పెద్దపల్లి/మంచిర్యాల,అక్టోబరు29(సందేశం టైమ్స్): మావోయిస్టు పార్టీలో లొంగుబాట్ల పరంపర కొనసాగుతోంది. మరో ఇద్దరు అగ్రనేతలు పోలీసుల ఎదుట లొంగిపోయారు. కేంద్ర కమిటీ సభ్యుడు పుల్లూరి ప్రసాదరావు అలియాస్ శంకరన్న అలియాస్ చంద్రన్న, రాష్ట్ర కమిటీ సభ్యుడు బండి ప్రకాష్ అలియాస్ ప్రభాత్ అలియాస్ బండి దాదా తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి సమక్షంలో లొంగిపోయి జనజీవన స్రవంతిలోకి వచ్చారు. మావోయిస్టులు ఆయుధాలను వీడి జనజీవన స్రవంతిలో కలవాలని సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు వీరిద్దరు లొంగిపోయారని డీజీపీ తెలిపారు. పుల్లూరి ప్రసాదరావు పేరిట రూ. 25 లక్షల రివార్డు, బండి ప్రకాష్ పేరిట రూ. 20 లక్షల రివార్డు ఉండగా.. ఆ మొత్తానికి సంబంధించిన డీడీలను వారికి డీజీపీ అందజేశారు. తెలంగాణలో ఈ ఏడాది ఇప్పటివరకు 427 మంది మావోయిస్టులు లొంగిపోయారని శివధర్‌రెడ్డి వెల్లడించారు. తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయిన వారిలో ఇద్దరు కేంద్ర కమిటీ సభ్యులు, ఎనిమిది మంది రాష్ట్ర కమిటీ సభ్యులు, ఇద్దరు డివిజనల్ కమిటీ కార్యదర్శులు, 8 మంది డివిజనల్ కమిటీ సభ్యులు, 35 మంది ఏరియా కమిటీ సభ్యులు ఉన్నారని తెలిపారు. ఇంకా మావోయిస్టు పార్టీలో తెలంగాణకు చెందిన 64 మంది వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. కేంద్ర కమిటీ సభ్యులుగా ఐదుగురు, రాష్ట్ర కమిటీ సభ్యులుగా 10 మంది, డివిజనల్, ఏరియా కమిటీల్లో 34 మంది, దళ సభ్యులుగా మరో 10 మంది ఉన్నారని వెల్లడించారు. కేంద్ర కమిటీలో ఇంకా మిగిలిన 9 మందిలో తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ, ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతి, పాక హన్మంతు అలియాస్ ఉకే గణేష్, మల్లా రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్, నరహరి అలియాస్ విశ్వనాథ్ మాత్రమే తెలంగాణకు చెందినవారని తెలిపారు.

# కపాస్ కిసాన్ యాప్‌తో రైతులకు మేలు

పెద్దపల్లి రూరల్, అక్టోబరు29(సందేశం టైమ్స్):పత్తి కొనుగోళ్లలో అక్ర మాలకు చెక్ పెట్టేందుకు సీసీఐ కొత్త విధానాన్ని ప్రవేశపెట్టిందని, కపాస్ కిసాన్ యాప్ ద్వారా రైతులకు మేలు జరుగుతుందని జిల్లా వ్యవసాయాధికారి భక్తి శ్రీనివాస్ అన్నారు. బ్రాహ్మణపల్లి రైతువేదికలో నిర్వహించిన రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా పత్తి రైతులు యాప్‌లో నమోదు, తేమ శాతం ఎంత ఉండాలనే అంశంపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వ హించారు. జిల్లా వ్యవసాయాధికారి మాట్లాడుతూ పత్తి రైతులు తమ వివరాలతోపాటు సాగుకు వివరాలు



ఆన్‌లైన్‌లో నమోదు చేసి స్లాట్ బుక్ చేసుకోవాలన్నారు. దీంతో కొనుగోలు కేంద్రాల వద్ద రద్దీ లేకుండా ఉం టుందని, తేమ శాతం ఆధారంగా సీసీఐ ధర చెల్లిస్తుందన్నారు. ఏడిఏ శ్రీనాద్, మండల వ్యవసాయధికారిణి అలివేణి, ఏఈవోలు పాల్గొన్నారు.

# పత్తి రైతుకు 'కపాస్' కష్టాలు

వాంకిడిఅక్టోబరు29(సందేశం టైమ్స్):పత్తి అమ్మకాల కోసం కేంద్రప్రభుత్వం కొత్తగా తెచ్చిన కపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్ బుకింగ్ నిబంధన రైతులకు ఇబ్బందికరంగా తయారైంది. కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 3.50 లక్షల ఎకరాలకుపైగా పత్తి సాగువుతుంది. చేతికొచ్చిన పంటను మార్కెట్లో విక్రయించుకోవాలంటే ముందుగా రైతులు కపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్ బుక్ చేసుకోవాలి. ఇందులో రైతు పేరు, ఊరు, సర్వే నంబరు, సాగుచేసిన పంటల విస్తీర్ణం తప్పనిసరి నమోదు చేయాల్సి ఉంటుంది. తేమ 12 శాతం దాటితే సీసీఐ అసలు కొనుగోలు చేయదు. తేమ శాతమే ప్రతిబంధకంగా మారుతుందనుకుంటే ఈ ఏడాది కొత్తగా కపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్ బుక్ చేసుకోవాలనే నిబంధన రైతులను మరింత ఆందోళనకు గురిచేస్తోంది. ఇలాంటి నిబంధనలు విధించడంతో రైతులు నష్టపోయే అవకాశం ఉందనే అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది.

– ఏజెన్సీ ప్రాంతాల్లో సిగ్నల్ సమస్య

ఆసిఫాబాద్ జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో ఫోన్ సిగ్నల్స్ సరిగా పనిచేయవు. పింఛన్లు, రేషన్ బియ్యం పంపిణీ కోసం ప్రభుత్వ సిబ్బంది, డీలర్లు అనేక ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో పత్తిని ప్రధాన పంటగా రైతులు సాగు చేసుకుంటున్నారు. జిల్లాలోని ఆసిఫాబాద్, తిర్యాణి, వాంకిడి, బెజ్జూరు, చింతలమానేపల్లి, కెరమెరి, జైనూర్ లాంటి మారుమూల ప్రాంతాల్లో కపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్‌బుక్ చేసుకోవడమనేది రైతులకు పరీక్షలా మారనుంది. వ్యవసాయ అధికారులు కపాస్ కిసాన్ యాప్‌పై రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా యాప్‌పై సరైన అవగాహన కలగడంలేదని రైతులు పేర్కొంటున్నారు. మారుమూల ప్రాంతాల్లో అనేక మంది నిరక్షరాస్యులైన రైతుల వద్ద స్మార్ట్ ఫోన్‌లు కూడా లేకపోవడంతో స్లాట్ బుకింగ్ రైతులకు మరింత ఇబ్బందికరంగా మారే అవకాశాలు ఉన్నాయని రైతులు వాపోతున్నారు. జిల్లావ్యాప్తంగా పత్తి కొనుగోళ్లు ప్రారంభమవుతున్న నేపథ్యంలో రైతులకు కపాస్ కిసాన్ యాప్‌పై సరైన అవగాహనలేక అనేక మంది రైతులు స్లాట్ బుకింగ్ చేయలేక పత్తి విక్రయించలేని పరిస్థితి నెలకొందని కొత్తగా ప్రభుత్వం తీసుకువచ్చిన నిబంధనలు సడలించి పత్తి కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

# తెలంగాణకు ఫ్లాష్ ఫ్లడ్ ముప్పు... ఐఎండీ హెచ్చరిక




హైదరాబాద్, అక్టోబరు29(సందేశం టైమ్స్):తెలుగు రాష్ట్రాలకు మరో ముప్పు పొంచి ఉంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు ఫ్లాష్ ఫ్లడ్ వచ్చే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ )హెచ్చరికలు జారీ చేసింది. ఏపీ, తెలంగాణతో పాటు మహారాష్ట్ర, విదర్భా ప్రాంతాలకు రాబోయే కొన్ని గంటల్లో తక్షణ వరద ముప్పు పొంచి ఉందని ఐఎండీ ప్రకటించింది. రాబోయే ఆరు గంటల్లో ఏపీలో, 24 గంటల్లో తెలంగాణ, విదర్భా, మరాఠవాడాలో తీవ్ర వర్షపాతం వల్ల వరద వచ్చే ఛాన్స్ ఉందనిపేర్కొంది. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచే అవకాశం ఉందని, వరద ప్రభావంతో రహదారులపై నీరు వచ్చి చేరవచ్చని వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తీర ప్రాంతమైన యానంతో పాటు గుంటూరు, ప్రకాశం జిల్లాలకు ఈ ముప్పు పొంచి ఉంది.తెలంగాణ రాష్ట్రం: ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, కామారెడ్డి, కరీంనగర్, సిద్దిపేట, వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్, జనగాం, యాదాద్రి భువనగిరి, మహబూబాబాద్, మెదక్, మేడ్చల్%-%మల్కాజ్గిరి, పెద్దపల్లి జిల్లా.




# క్రీడావార్తలు




## తైక్వాండో క్రీడలో అవినీతి, మోసాలపై దేశవ్యాప్తంగా

# “నామ్‌దేవ్ హటావో - దేశ్ బచావో, తైక్వాండో బచావో”




సందేశం టైమ్స్ - జాతీయ తెలుగు దినపత్రిక తేదీ: 29-10-2025: తైక్వాండో క్రీడలో అవినీతి, మోసాలపై దేశవ్యాప్తంగా “నామ్‌దేవ్ హటావో - దేశ్ బచావో, తైక్వాండో బచావో” అనే నినాదం మార్మోగుతోంది. తైక్వాండో ఆటగాళ్లు, కోచ్‌లు, క్రీడాభిమానులు కలిసి తైక్వాండో క్రీడను మోసగాళ్ల బంధనాల నుండి రక్షించాలనే సంకల్పంతో ముందుకు వస్తున్నారు.తెలుసుకున్న వివరాల ప్రకారం, “ఇండియా తైక్వాండో” పేరుతో దేశవ్యాప్తంగా నకిలీ కార్యకలాపాలు జరుగుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆటగాళ్ల నుండి పెద్ద మొత్తంలో డబ్బు వసూలు చేయడం, రాష్ట్ర బాడీలలో కోచ్‌ల నియామకాలలో అవినీతి, అంతర్గత లావాదేవీల ద్వారా స్థానాలు కొనుగోలు చేసుకోవడం వంటి చర్యలు విస్తృత చర్చకు దారితీశాయి.మోసాలపై ఎవరు ప్రశ్నించినా, వారిని తప్పుబట్టడం లేదా తైక్వాండో అభివృద్ధి పేరిట తప్పుడు ప్రచారాలు చేయించడం జరుగుతోందని బాధితులు చెబుతున్నారు. నిజమైన సీనియర్ కోచ్‌లు, అనుభవజ్ఞులు ఈ సంస్థ నుండి దూరంగా ఉన్నారు, ఎందుకంటే ఇది పూర్తిగా మోసపూరిత వ్యవస్థగా మారిందని వారు పేర్కొన్నారు.క్రీడలో నిజాయితీగా శిక్షణ పొందుతున్న విద్యార్థుల సొమ్మును దోచుకుంటున్న ఈ నకిలీ సంఘంపై కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ దృష్టి సారించాలని, దేశవ్యాప్తంగా నిష్పాక్షిక విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని తైక్వాండో సమాజం డిమాండ్ చేస్తోంది.“తైక్వాండో క్రీడను రక్షించండి %-% ఆటగాళ్ల హక్కులను కాపాడండి” అనే నినాదంతో, ఆటగాళు , సోషల్ మీడియా వేదికలపై పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. క్రీడలో నిజాయితీని పునరుద్ధరించే దిశగా తైక్వాండో అభిమానులు కదలిక మొదలుపెట్టారు.

# ఫైనల్ బెర్త్ ఎవరిదో





గువాహటి: వరుసగా రెండోఫైనల్‌పై ఇంగ్లండ్ గురిపెట్టగా.. దక్షిణాఫ్రికా తొలిసారి వన్డే వరల్డ్‌కప్ తుది పోరుకు చేరి చరిత్ర సృష్టించాలనుకొంటోంది. ఈ క్రమంలో బుధవారం జరిగే తొలి సెమీఫైనల్లో నాలుగుసార్లు చాంపియన్ ఇంగ్లండ్‌తో దక్షిణాఫ్రికా తలపడనుంది. లీగ్ దశలో సఫారీలను చిత్తుగా ఓడించిన ఇంగ్లండ్ ఈ మ్యాచ్‌లో ఫేవరెట్‌గా కనిపిస్తోంది. అయితే, మెరుగైన బ్యాటింగ్ ప్రదర్శనతో బదులు తీర్చుకోవాలని దక్షిణాఫ్రికా వ్యూహాలు రచిస్తోంది. ముఖ్యంగా స్పిన్ బౌలింగ్‌ను ఎదుర్కోవడంలో ఘోరంగా తడబడుతున్న లారా వొల్వార్ట్ సేన ఆ బలహీనతకు చెక్ చెప్పాలనుకొంటోంది. ఇంగ్లండ్‌తో మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా కేవలం 69 పరుగులకే కుప్పకూలింది. కానీ, ఆ తర్వాత ఒత్తిడిని అధిగమిస్తూనే ఐదు మ్యాచ్‌లు గెలిచి నాకౌట్ బెర్త్‌ను సొంతం చేసుకొంది. కానీ, ఆఖరి లీగ్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా చేతిలో మరోసారి ఘోరంగా ఓడడం ఆ జట్టు ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసేదే. కెప్టెన్ లారా వొల్వార్ట్, తజ్మిమ్ బ్రిట్స్, మరిజానె కాప్, డి క్లెర్క్ జట్టు బ్యాటింగ్‌కు ప్రధాన బలం. బౌలింగ్‌లో ఛ్లో ట్రయాన్, ఎమ్‌లాబా, క్లాస్, కాప్‌పై జట్టు ఆధారపడింది. మరోవైపు ఇంగ్లండ్ ఫుల్ జోష్‌లో ఉంది. అమీ జోన్స్, బ్యూమాంట్, హీథర్ నైట్ బ్యాట్‌తో అదరగొడుతున్నారు. సారథి సివర్ బ్రంట్ ఆల్‌రౌండ్ ప్రదర్శన జట్టుకు ప్లస్‌గా మారింది. వికెట్ స్పిన్‌కు సహకరించే అవకాశాలుండడంతో సోఫీ ఎకెల్‌స్టోన్, లిండ్సే స్మిత్, చార్లీ డీన్ నుంచి దక్షిణాఫ్రికా సవాల్ ఎదురయ్యే అవకాశం ఉంది. అయితే, గాయంతో బాధపడుతున్న ఎకెల్‌స్టోన్ ఫిట్‌నెస్‌పై ఇంకా స్పష్టత రాలేదు. మ్యాచ్‌కు వర్షం ఆటంకం కలిగించే అవకాశాలు లేవు.

# అయ్యర్‌కు సర్జరీ జరగలేదు: సైకియా




టీమిండియా స్టార్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్‌ఆసీస్‌తో జరిగిన మూడో వన్డేలో తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. క్యాచ్ అందుకునే క్రమంలో పక్కటెముకలు నేలను బలంగా తాకడంతో అతడి ప్లీహానికి గాయమై అంతర్గతంగా రక్తస్రావం అయింది. దీంతో అయ్యర్‌ను ఐసీయూలో చేర్చారని వార్తలు వచ్చాయి. అయితే బీసీసీఐ మాత్రం అతడి పరిస్థితి నిలకడగానే ఉందని వెల్లడించింది. శ్రేయస్‌కు సర్జరీ జరిగిందని, కనీసం ఎనిమిది వారాల పాటు విశ్రాంతి అవసరమని వైద్యులు సూచించినట్లు క్రికెట్ వర్గాలు తెలిపాయి. ఈ విషయంపై తాజాగా బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా మరోసారి స్పందించారు.‘శ్రేయస్ అయ్యర్ ఆరోగ్యంగానే ఉన్నాడు. వైద్యులు అనుకున్న దాని కంటే వేగంగా కోలుకుంటున్నాడు. శ్రేయస్ ఎలాంటి సర్జరీ చేయించుకోలేదు. భిన్నమైన వైద్య ప్రక్రియతో అంతర్గత రక్తస్రావం జరగకుండా చూశారు. డాక్టర్ రిజ్వాన్‌తో నిరంతరం టచ్‌లో ఉన్నా. సిడ్నీ ఆసుపత్రిలోనే టీమిండియా వైద్యుడు కూడా ఉన్నారు. అయ్యర్ పూర్తిగా కోలుకుని రావడానికి కనీసం ఎనిమిది వారాలు పడుతుందని అనుకుంటున్నాం. కానీ అతడి తీరు చూస్తే ఇంకాస్త ముందుగానే కోలుకున్నా ఆశ్చర్యపోనక్కర్లేదు. వైద్యులు కూడా శ్రేయస్ పరిస్థితి మెరుగుదలపై సంతృప్తిగా ఉన్నారు. ఇప్పటికే అతడు తన రోజువారీ కార్యక్రమాలను చేసుకుంటున్నాడు. అతడి గాయం తీవ్రమైందే కావచ్చు కానీ ప్రమాదం నుంచి అయితే బయటపడ్డాడు. ఇప్పటికే ఐసీయూ నుంచి అతడిని సాధారణ రూమ్‌కు మార్చారు’ అని సైకియా తెలిపారు.‘చాలా సోషల్ మీడియా ఛానళ్లలో శ్రేయస్‌కు సర్జరీ జరిగిందని వార్తలు వస్తున్నాయి. కానీ అతడికి ఎలాంటి సర్జరీ జరగలేదు. బయట వస్తున్న వార్తలన్నీ అవాస్తవాలు. అతడి ప్లీహంలో అంతర్గత రక్తస్రావం ఆపేందుకు భిన్నమైన వైద్య ప్రక్రియను చేపట్టారు. అందుకే చాలా త్వరగా రికవరీ అవుతున్నాడు. ఇలాంటి గాయాలు ఉన్నప్పుడు కనీసం వారం రోజులు ఆసుపత్రిలోనే ఉండాలి. వేగంగా కోలుకుంటున్నప్పటికీ శ్రేయస్ కూడా ఆసుపత్రిలోనే ఉంటాడు’ అని సైకియా స్పష్టం చేశాడు. కాగా అయ్యర్ కుటుంబసభ్యులు ఇప్పటికే ఆస్ట్రేలియాకు పయనమైన విషయం తెలిసిందే.

# కోలుకుంటున్న శ్రేయాస్



సిడ్నీ: ఆస్ట్రేలియాతో మూడో వన్డేలో తీవ్రంగా గాయపడిన శ్రేయాస్ అయ్యర్ వేగంగా కోలుకుంటున్నాడు. ప్రస్తుతం సిడ్నీలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్న అతడికి చిన్నపాటి శస్త్రచికిత్స చేసినట్టు సమాచారం. మూడో వన్డేలో అలెక్స్ క్యారీ క్యాచ్ పట్టే క్రమంలో కిందపడిన అయ్యర్ పక్కటెముకలకు గాయమైంది. స్కానింగ్‌లో ప్లీహం రక్తస్రావానికి గురైందని తేలడంతో రెండురోజులు ఐసీయూలోనే ఉంచి, ఆ తర్వాత స్పెషల్ వార్డుకు మార్చారు. మంగళవారం తీసిన స్కానింగ్‌లో రక్తస్రావం ఆగినట్టు తేలిందని, అతను వేగంగా కోలుకుంటున్నట్టు బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా పేర్కొన్నారు. డాక్టర్ల ఊహించినదానికంటే అత్యంత వేగంగా అయ్యర్ కోలుకుంటున్నాడన్నారు. టీమ్ డాక్టర్ రిజ్వాన్ ఖాన్ శ్రేయాస్ వెంటే ఉండి పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. అటు టీ20 కెప్టెన్ సూర్యకుమార్ సైతం శ్రేయాస్ ఆరోగ్య పరిస్థితి ఆశాజనకంగా ఉందని, ఇప్పటికే పలుమార్లు అతడితో ఫోన్‌లో మాట్లాడానని చెప్పాడు. మరో వారంరోజుల విశ్రాంతి తర్వాత శ్రేయాసను డిశ్చార్జి చేసే అవకాశముందని బోర్డు వర్గాలు పేర్కొన్నాయి.

# ఐసీసీని ఆడిస్తున్న భారత్



న్యూఢిల్లీ: ఐసీసీని భారత క్రికెట్ బోర్డు తన చెప్పుచేతల్లో పెట్టుకొందని ఇంగ్లండ్‌కు చెందిన మాజీ మ్యాచ్ రెఫరీ క్రిస్ బ్రాడ్ సంచలన ఆరోపణలు చేశాడు. భారత్ ఆడే మ్యాచ్‌ల్లో ఆ జట్టుకు కొంత అనుకూలంగా వ్యవహరించాలనే ఒత్తిడి తీవ్రంగా ఉండేదని ఓ ఇంటర్వ్యూలో చెప్పాడు. ‘ఒక మ్యాచ్‌లో నిర్ణీత సమయంలో బౌల్ చే యాల్సిన ఓవర్ల కన్నా టీమిండియా 3-4 ఓవర్లు తక్కువగా వేసింది. నిబంధనల ప్రకారం జరిమానా విధించాలి. అయితే, సరిగ్గా ఆ సమయంలోనే ఫోన్ వచ్చింది. ఆడేది భారత్ కాబట్టి చూసీచూడనట్టు వెళ్లాలని సూచించారు. సమయాన్ని ఏదో విధంగా సరిచేయాలని చెప్పడంతో.. తప్పలేద’ని చెప్పాడు. కానీ, ఆ తర్వాతి మ్యాచ్‌లో స్లో ఓవర్ రేట్ గురించి కెప్టెన్ సౌరవ్ గంగూలీని హెచ్చరించినట్టు తెలిపాడు. అయినా.. అతడు పట్టించుకోక పోవడంతో నిబంధనల ప్రకారం నడుచుకోవాల్సి వచ్చిందని బ్రాడ్ చెప్పాడు.

# బరిలో నిఖత్ ప్రపంచ బాక్సింగ్ కప్




న్యూఢిల్లీ: ప్రపంచ బాక్సింగ్ కప్‌లో పాల్గొనే భారత బృందాన్ని జాతీయ బాక్సింగ్ సమాఖ్య వెల్లడించింది. మహిళల 51 కిలోల విభాగంలో ప్రపంచ మాజీ చాంపియన్ నిఖత్ జరీన్ బరిలోకి దిగుతోంది. ఈ పోటీల గురించి నిఖత్ మాట్లాడుతూ వచ్చే ఆసియా, కామన్వెల్త్ క్రీడల్లో బరిలోకి దిగడానికి కావాల్సిన ర్యాంకింగ్ పాయింట్లకు ఈ ప్రపంచ బాక్సింగ్ కప్ ఫైనల్స్ పోటీలు ముఖ్యమైనవని, ఇందులో ఎక్కువ పాయింట్లు సాధించి సీడింగ్‌ను మెరుగు పర్చుకోవాల్సి ఉందని తెలిపింది. నిఖత్‌తో పాటు మొత్తం ఇరవై మంది భారత బాక్సర్లు వివిధ విభాగాల్లో తలపడనున్నారు. ఈ పోటీలు వచ్చే నెల 14 నుంచి 21 వరకు గ్రేటర్ నోయిడాలో జరగనున్నాయి. మొత్తం 18 దేశాల నుంచి 140 మందికి పైగా బాక్సర్లు ఈ పోటీల్లో పాల్గొంటున్నారు.

# బిజినెస్




## ధరల తగ్గుదలకు బ్రేక్.. మళ్లీ పెరిగిన గోల్డ్ రేట్స్



ఇంటర్నెట్ డెస్క్: గత రెండు రోజులుగా తగ్గుతూ వచ్చిన బంగారం ధరలు బుధవారం స్వల్పంగా పెరిగాయి. వెండి ధరల్లో కూడా పెరుగుదల కనిపించింది. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, బుధవారం మధ్యాహ్నం 12.00 గంటలకు 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర నిన్నటితో పోలిస్తే రూ.760 మేర పెరిగి రూ.1,21,580గా ఉంది. ఇక 22 క్యారెట్ ఆర్నమెంటల్ బంగారం ధర రూ.700 మేర పెరిగి రూ.1,15,450కు చేరుకుంది. కిలో వెండి ధర కూడా రూ.వెయ్యి మేర పెరిగి రూ.1,52,000కు చేరుకుంది. హైదరాబాద్‌లో 24 క్యారెట్ బంగారం ధర రూ.1,21,580గా ఉంది. కిలో వెండి ధర రూ.1,66,000గా ఉంది. విజయవాడలో దాదాపు ఇవే రేట్స్ కొనసాగుతున్నాయి %ఇక అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్స్ (31.10 గ్రాములు) 24 క్యారెట్ పసిడి స్పాట్ ధరలు 0.2 శాతం మేర పెరిగి 3,957 డాలర్లకు చేరుకున్నాయి. ప్రస్తుతం బంగారం, వెండి ధరల్లో హెచ్చుతగ్గులను దిద్దుబాటుగా మాత్రమే చూడాలని, ఇది దీర్ఘకాలిక ట్రెండ్ కాదని మార్కెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఇప్పటివరకూ ధరలు ఏకంగా 50 శాతం మేర పెరిగిన నేపథ్యంలో మదుపర్లు లాభాల స్వీకరణకు దిగడం సర్వసాధారణం. అయితే, అమెరికా, చైనా ఉద్రిక్తతలు తగ్గుతున్న వేళ ధరలు మరింత తగ్గే ఛాన్సు ఉందన్న అభిప్రాయం కూడా వినిపిస్తోంది.

## 2030 నాటికి రూ.35.32 లక్షల కోట్లు




న్యూఢిల్లీ: భారత ఐటీ, కృత్రిమ మేధ (ఏఐ) సేవల మార్కెట్ 2030 నాటికి 400 బిలియన్ డాలర్లకు (40,000 కోట్ల డాలర్లు= రూ.35.32 లక్షల కోట్లు) చేరుకోవచ్చని బెస్సెమెర్ వెంచర్ పార్ట్‌నర్స్ నివేదిక అంచనా వేసింది. వ్యాపారాల వృద్ధికి ఏఐ సేవల వినియోగం విరివిగా పెరుగుతుండటంతో పాటు అంతర్జాతీయంగా ఐటీ సేవల ఔట్‌సోర్సింగ్ భారీగా పెరగనుండటం ఇందుకు దోహదపడనుందని నివేదిక పేర్కొంది. భారత ఐటీ పరిశ్రమ 2021-22 ఆర్థిక సంవత్సరం నుంచి 2024-25 ఆర్థిక సంవత్సరం వరకు ఏటేటా 8.1 శాతం చొప్పున వృద్ధి చెందుతూ 26,400 కోట్ల డాలర్లకు చేరుకుందని బెస్సెమెర్ నివేదికలో ప్రస్తావించింది. 2025-30 ఆర్థిక సంవత్సరాల మధ్య కాలంలో ఏటేటా 8.7 శాతం చొప్పున వృద్ధి చెంది 40,000 కోట్ల డాలర్లకు చేరుకోవచ్చని అంచనా వేసింది. ఐటీ రంగం నిర్మాణాత్మక మార్పులకు లోనవుతున్న తరుణంలో ఈ నివేదిక అత్యంత ఆశావహ అంచనాలను విడుదల చేయడం గమనార్హం. ఏఐ, డిజిటల్ టెక్నాలజీలతో ఐటీ రంగంలో క్లయింట్ల ప్రాధాన్యాలు, వ్యయాల తీరులో గణనీయ మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఏఐతో ఐటీ కంపెనీలు క్లయింట్ల నుంచి వసూలు చేసే చార్జీలపై ఒత్తిడి పెంచనున్నప్పటకీ, మరిన్ని కొత్త మార్కెట్లు అందుబాటులోకి రానుండటం వాటి ఆదాయ పెరుగుదలకు దోహదపడనుందని బెస్సెమెర్ వెంచర్ పార్ట్‌నర్స్ సీఓఓ నితిన్ కైమల్ అన్నారు.

## యాపిల్ 4 లక్షల కోట్ల డాలర్లు



ఐఫోన్ తయారీ దిగ్గజం యాపిల్ మార్కెట్ విలువ తొలిసారిగా 4 ట్రిలియన్ డాలర్ల (నాలుగు లక్షల కోట్ల డాలర్లు)కు చేరింది. ఈ ఏడాది సెప్టెంబరులో విడుదల చేసిన ఐఫోన్ 17 మోడళ్లు ప్రపంచవ్యాప్తంగా జోరుగా అమ్ముడవుతుడంటంతో కంపెనీ షేరు గడిచిన 3 నెలల్లో 25 శాతం మేర పుంజుకుంది. పైగా ఈ గురువారం కంపెనీ త్రైమాసిక ఆర్థిక ఫలితాలు ప్రకటించనుంది. కంపెనీ పనితీరుపై ఆశాజనక అంచనాలతో మంగళవారం షేరు ధర మరింత పెరిగి 269.87 డాలర్ల వద్ద సరికొత్త ఏడాది గరిష్ఠాన్ని నమోదు చేసింది. యాపిల్‌తోపాటు మైక్రోసాఫ్ట్ మార్కెట్ క్యాపిటలైజేషన్ సైతం 4 లక్షల కోట్ల డాలర్లు దాటింది. అయితే, ఈ జులైలోనూ మైక్రోసాఫ్ట్ ఈ మార్క్‌ను తాకింది. కాగా, ఏఐ చిప్‌ల తయారీ దిగ్గజం ఎన్‌విడియా 4.6 లక్షల కోట్ల డాలర్ల మార్కెట్ క్యాప్‌తో ప్రపంచంలోనే అత్యంత విలువైన కంపెనీగా కొనసాగుతోంది.

నోకియాలో ఎన్‌విడియా 100 కోట్ల డాలర్ల పెట్టుబడి టెలికాం నెట్‌వర్క్, పరికరాల తయారీ దిగ్గజం నోకియాలో ఎన్‌విడియా 100 కోట్ల డాలర్ల (రూ.8,829 కోట్లు) పెట్టుబడులు పెడుతోంది. ఇందుకు గాను ఎన్‌విడియాకు నోకి యా 16.6 కోట్ల కొత్త షేర్లను జారీ చేయనుంది. ఈ డీల్ నేపథ్యంలో నోకియా షేరు ఏకంగా 18% పెరిగింది.

## భారీ నష్టాల నుంచి కోలుకున్న సూచీలు.. ఈ రోజు టాప్ స్టాక్స్ ఇవే



ఉదయం భారీ నష్టాలను చవి చూసిన దేశీయ సూచీలు చివర్లో కోలుకున్నాయి. ఇంట్రాడే కనిష్టం నుంచి దాదాపు 400 పాయింట్లు పుంజుకున్నాయి. చివరకు ఓ మోస్తరు నష్టాలతో రోజును ముగించాయి. చైనా-అమెరికా మధ్య ట్రేడ్ డీల్ కుదిరే సూచనలు ఉన్నాయని వార్తలు రావడం, అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లు తగ్గించనుందనే అంచనాలు వెలువడిన నేపథ్యంలో మదుపర్లు మళ్లీ కొనుగోళ్లకు మొగ్గు చూపారు. దీంతో సెన్సెక్స్, నిఫ్టీ ఓ మోస్తారు నష్టాలతో ముగిశాయి. గత సెషన్ ముగింపు (84, 778)తో పోల్చుకుంటే మంగళవారం ఉదయం 150 పాయింట్లకు పైగా నష్టంతో మొదలైన సెన్సెక్స్ ఆ తర్వాత మరింత కిందకు దిగజారింది. ఒక దశలో సెన్సెక్స్ 550 పాయింట్లకు పైగా కోల్పోయి 84, 219 వద్ద ఇంట్రాడే కనిష్టానికి చేరుకుంది. అయితే మధ్యాహ్నం తర్వాత భారీ నష్టాల నుంచి రికవరీ అయింది. చివరకు 150 పాయింట్ల నష్టంతో 84, 628 వద్ద రోజును ముగించింది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదలాడింది. చివరకు 29 పాయింట్ల నష్టంతో 25, 936 వద్ద స్థిరపడింది %సెన్సెక్స్‌లో సుజ్‌లాన్ ఎనర్జీ, జిందాల్ స్టీల్, ఇండస్ టవర్స్, ఇండస్ ఇండ్ బ్యాంక్, యూపీఎల్ మొదలైన షేర్లు లాభాలు ఆర్జించాయి మారకం విలువ 88.27గా ఉంది.

## జోరుగా డేటా సెంటర్లు




న్యూఢిల్లీ: దేశంలో డేటా కేంద్రాల (డీసీ) ఏర్పాటు జోరందుకుంది. ఇప్పటికే భారత్‌లో 1,400 మెగావాట్ల సామర్థ్యం ఉన్న డీసీలు ఏర్పాటయ్యాయి. వీటి సామర్థ్యం 2027 నాటికి రెట్టింపై, 2030 నాటికి ఐదు రెట్లు పెరుగుతుందని మక్వేరీ ఈక్విటీ రీసెర్చ్.. 'రాక్స్ టు రిచెస్: ఇండియా డేటా సెంటర్స్' పేరుతో రూపొందించిన నివేదికలో తెలిపింది. దేశంలో ఇప్పటికే 1,400 మెగావాట్ల సామర్థ్యం గల డేటా సెంటర్లు కార్యకలాపాలు సాగిస్తుండగా మరో 1,400 మెగావాట్ల సెంటర్లు నిర్మాణంలో ఉన్నాయి. వీటితో పాటు దాదాపు 5,000 మెగావాట్ల సామర్థ్యం గల డేటా సెంటర్లను ఏర్పాటు చేసేందుకు పలు కంపెనీలు ప్రణాళికలు రచిస్తున్నట్లు నివేదిక వెల్లడించింది. సర్వర్ల ఖర్చులు పక్కన పెట్టినా ఒక మెగావాట్ సామర్థ్యం ఉన్న డేటా కేంద్రం ఏర్పాటుకు 40 లక్షల నుంచి 70 లక్షల డాలర్లు ఖర్చవుతుంది. దీంతో 2030 నాటికి డేటా సెంటర్ల ద్వారానే మన దేశం 3,000 కోట్ల డాలర్ల నుంచి 4,500 కోట్ల డాలర్ల (సుమారు రూ.4 లక్షల కోట్లు) పెట్టుబడులను ఆకర్షించే అవకాశం ఉందని ఆ నివేదిక పేర్కొంది. ఇందులో గూగుల్ కంపెనీ ఒక్కటే అదానీ గ్రూప్‌తో కలిసి ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం వద్ద 1,500 కోట్ల డాలర్ల పెట్టుబడితో 1,000 మెగావాట్ల డేటా కేంద్రం, ఏఐ ఆధారిత మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయనుంది. దేశంలో డేటా కేంద్రాల ఏర్పాటుకు దోహదం చేసే అంశాలేమిటంటే..

## ఆర్‌సీపీఎల్‌తో సాంప్రే న్యూట్రిషన్స్ జట్టు




: తెలంగాణకు చెందిన సాంప్రే న్యూట్రిషన్స్.. రిలయన్స్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ (ఆర్‌సీపీఎల్)తో జట్టు కట్టింది. ఒప్పందంలో భాగంగా ఆర్‌సీపీఎల్ కోసం పోషకాహార ఉత్పత్తుల తయారీ, సరఫరాను సాంప్రే చేపట్టనుంది. ఈ ఒప్పంద కాలపరిమితి మూడేళ్లు. ఆర్‌సీపీఎల్ భాగస్వామ్యంతో ఏటా రూ.12 కోట్ల నుంచి రూ.15 కోట్ల వ్యాపారం లభిస్తుందని అంచనా వేస్తున్నట్లు సాంప్రే వెల్లడించింది. కాగా సాంప్రే ఇటీవల వివిధ కంపెనీలతో రూ.45 కోట్ల విలువైన తయారీ, సరఫరా ఒప్పందాలను కుదుర్చుకుంది. ఫారిన్ కరెన్సీ కన్వర్టబల్ బాండ్ల జారీ ద్వారా రూ.355 కోట్లు సమీకరించేందుకు బోర్డు ఆమోదం తెలిపింది.

## టాటా ట్రస్ట్స్ నుంచి మెహ్లీ మిస్త్రీ ఔట్



న్యూఢిల్లీ: టాటా గ్రూప్ దాతృత్వ సంస్థ టాటా ట్రస్ట్స్‌లో ఇంటి పోరు మరింత ముదిరింది. మెహ్లీ మిస్త్రీని తిరిగి ట్రస్టీగా నియమించే తీర్మానానికి ట్రస్ట్స్ చైర్మన్ నోయెల్ టాటా, అతనికి సన్నిహితులైన మరో ఇద్దరు ట్రస్టీలు టీవీఎస్ గ్రూప్ గౌరవ చైర్మన్ వేణు శ్రీనివాసన్, రక్షణ మంత్రిత్వ శాఖ మాజీ కార్యదర్శి విజయ్ సింగ్ వ్యతిరేకించడంతో తీర్మానం వీగిపోయినట్టు సమాచారం. దీంతో రతన్ టాటాకు వీర విధేయుడైన మిస్త్రీని మరోసారి టాటా ట్రస్ట్స్ జీవిత కాల ట్రస్టీగా పునర్నియమించే ప్రయత్నాలు బెడిసికొట్టాయి. కాగా మెహ్లీ మిస్త్రీ పదవీ కాలం మంగళవారంతో ముగిసింది.

TGTEL/25/A0348 TITLE: Sandhesham Times 3-82,Ananthagiri, Singavaram, SURYAPET, Telangana,508 206 Gmail : sandeshamtimes@gmail.com Website:https://sandeshamtimes.com Publisher Press (Name & Address) SUNDAY PRINTING PRESS 3-4297,SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADHESH-522 006